శనివారం
31-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 71
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హమాస్ సెల్ చీఫ్ హతం: ఇజ్రాయిల్

జెనిన్: జెనిన్‌లో హమాస్ సెల్ చీఫ్‌ను తమ దళాలు హతమార్చినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) శుక్రవారం ఒక ప్రకటన చేశాయి. వెస్ట్‌బ్యాంక్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపే ఆపరేషన్‌లో వసీమ్ హాజెమ్‌ను మట్టుబెట్టినట్లు ఐడీఎఫ్ తెలిపింది. ఉత్తర సమరియా ప్రాంతంలో కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్‌ను ఐడీఎఫ్, ఐఎస్ఏ, ఇజ్రాయిల్ సరిహద్దు పోలీసులు సంయుక్తంగా చేపట్టాయని వెల్లడించింది జెనిన్‌లోని హమాస్ ఉగ్ర సంస్థకు అధిపతి వసీం హాజెమ్ నేతృత్వ ఉగ్రసెల్‌ను ఇజ్రాయిల్ సరిహద్దు పోలీసు దళాలు గుర్తించగా... ఐఎస్ఏ ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు నిర్వహించిన ఎన్‌కౌంటర్‌లో హాజెమ్ మరణించినట్లు టెలిగ్రామ్‌లో ఐడీఎఫ్ పేర్కొంది.

రహస్య కెమెరాల కలకలం

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల వద్ద తీవ్ర ఉద్రిక్తత

- బాలికల హాస్టల్ వాష్ రూమ్‌లో కెమెరాలు అమర్చారని విద్యార్థినుల ఫిర్యాదు
- హాస్టల్ లోపల విద్యార్థినులు, విద్యార్థి సంఘాల బైఠాయింపు
- ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు
- మంత్రి రవీంద్ర హామీతో ఆందోళన విరమణ

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం/గుడివాడ: బాలికలు, విద్యార్థినులు, యువతులపై రోజురోజుకీ ఘాతుకాలు పెరిగిపోతున్నాయి. విద్యా సంస్థల్లో వీరికి రక్షణ లేకుండాపోయింది. వీరిని కామాంధులు వెంటాడుతున్నారు. దీంతో చదువుకునే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. ఇప్పటికే కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటన దేశ వ్యాప్తంగా ఆందోళనకు దారితీసింది. తాజాగా కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఘటనతో ఆడపిల్లలకు రక్షణ కరువైందన్న విషయం మరోసారి స్పష్టమైంది. కళాశాల అనుబంధిత విద్యార్థినుల హాస్టల్ వాష్ రూమ్‌లో రహస్య (హిడెన్) కెమెరాలు ఏర్పాటు చేసిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఘటనను పరిశీలిస్తే... గుడ్లవల్లేరు శేషాద్రి ఇంజినీరింగ్ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి తన స్నేహితురాలి సాయంతో బాలికల హాస్టల్ వాష్ రూమ్‌లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి నగ్న దృశ్యాలు చిత్రీకరించారని ఆరోపిస్తూ విద్యార్థినులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించారు. విద్యార్థులకు మద్దతుగా కళాశాల వద్ద విద్యార్థి సంఘాలు నిరసనకు దిగాయి. అయితే ఈ ఘటనకు సంబంధించి విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్, పోలీసులు చెబుతున్న కథనాలు భిన్నంగా ఉన్నాయి. కాగా, హాస్టల్ ప్రాంగణంలోనే గురువారం అర్ధరాత్రి విద్యార్థినులు ఆందోళన చేస్తూ సెల్ ఫోన్ టార్చ్ లైట్లు వేస్తూ 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. కెమెరాల ద్వారా వచ్చిన వీడియోలను అమ్ముతున్నాడంటూ బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడికి యత్నించిన విషయం తెలుసుకొని కళాశాల హాస్టల్‌కు పోలీసులు రంగ ప్రవేశం చేసి నాల్గవ సంవత్సరం విద్యార్థి విజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే విద్యార్థినులు తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని శుక్రవారం కూడా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థినులు మాట్లాడుతూ వాష్ రూమ్‌లో

- మిగతా 2 లో

గుడ్లవల్లేరు ఘటనపై కఠిన చర్యలు

రామకృష్ణ డిమాండ్ 2లో



సీఎం సీరియస్

ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యార్థినులకు హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాలు పెట్టారనే అంశంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మన ఇంట్లో ఆడబిడ్డలకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో, అంతే సీరియస్ గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఆందోళనలో ఉన్న వారికి ఒక భరోసా కల్పించాలని సీఎం ఆదేశించారు. ఉదయం ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులను, మంత్రి కొల్లు రవీంద్రను, జిల్లా ఎమ్మెల్యేలను

- మిగతా 2 లో

షూటర్ అవనికి స్వర్ణం

- మోనాకు కాంస్యం మనీశ్‌కు రజతం
- చరిత్ర సృష్టించిన స్ప్రింటర్ ప్రీతిపాల్

పారిస్: పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటారు. రెండో రోజు వరుస పతకాలు సాధించారు. పారా షూటర్ అవనీ లేఖరా (22), స్ప్రింటర్ ప్రీతిపాల్ (23) చరిత్ర సృష్టించారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (ఎస్‌హెచ్ 1) షూటింగ్ పోటీల్లో స్వర్ణం సాధించిన తొలి భారతీయ

- మిగతా 2 లో

న్యాయ చిక్కుల్లో జగదీశ్ టైట్లర్

కాంగ్రెస్ నేతపై అభియోగాల నమోదుకు ఢిల్లీ కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత జగదీశ్ టైట్లర్ చిక్కుల్లో పడ్డారు. 1984 సిక్కుల వ్యతిరేక అల్లర్లలో ఢిల్లీలోని పుల్ బంగాష్‌లో ముగ్గురి హత్య, ఇతర నేరాల కింద టైట్లర్‌పై అభియోగాల నమోదుకు ఢిల్లీ కోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. టైట్లర్‌పై విచారణ చేపట్టేందుకు సరిపడ సాక్ష్యాధారాలు ఉన్నాయని సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి రాకేశ్ సియల్ వెల్లడించారు. తదుపరి విచారణను సెప్టెంబరు 13వ తేదీకి వాయిదా వేశారు. నేరాన్ని ఒప్పుకుంటారా లేదా అని

- మిగతా 2 లో

వైసీపీ ఎమ్మెల్సీలు కళ్యాణ్ చక్రవర్తి, పద్మశ్రీ రాజీనామా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైసీపీ ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పద్మశ్రీ రాజీనామాలకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే వైసీపీకి ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా చేశారు. వారి రాజీనామాలతో శాసన మండలిలోనూ వైసీపీ బలం తగ్గుముఖం పట్టనుంది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్ రాజీనామా బాట పట్టారు. వాటి నుంచి వైసీపీ కోలుకోకముందే మరో ఇద్దరు ఎమ్మెల్సీలు రాజీనామా బాటలో ఉన్నట్లు ప్రచారం ఉంది. జాతీయ మత్స్యకార మహిళా అధ్యక్షురాలుగా, రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి మహిళా అధ్యక్షురాలిగా పని చేసిన కర్రి పద్మశ్రీ గతంలో వైసీపీలో చేరారు. మార్చి 2023లో జరిగిన ఎన్నికలకు గవర్నర్ కోటా నుంచి వైసీపీ ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. తిరుపతి లోక్‌సభ నుంచి 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన బల్లి దుర్గాప్రసాద్ కుమారుడు... బల్లి కళ్యాణ్ చక్రవర్తి 2021లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలిచారు. ఎమ్మెల్సీలు కల్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ రాజీనామాలకు గల కారణాలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

నా కేబినెట్‌లో రిపబ్లికన్‌కు అవకాశమిస్తా

దేశం కోసం కొత్త పథాన్ని ఎంచుకునేందుకు అమెరికన్లు సంసిద్ధమయ్యారని డెమొక్రాట్ పార్టీ తరపు అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న కమలా హారిస్ అన్నారు. అధికారంలోకి వస్తే కేబినెట్‌లో రిపబ్లికన్‌కు స్థానం కల్పిస్తామని ప్రకటించారు. 2లో

మోదీకి నితీశ్ ఝలక్

- కులగణనపై విపక్షంతో గొంతు కలిపిన జేడీ(యూ)
- ఇప్పటికే మద్దతిచ్చిన ఎల్జేపీ
- ఎన్డీఏ సర్కారుపై పెరుగుతున్న ఒత్తిడి
- జనగణనతో పాటు కులసర్వేకు యోచన!

న్యూఢిల్లీ: కులగణన విషయంలో జేడీ(యూ) అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పట్టుదలగా ఉన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కుల గణన జరపాలని డిమాండ్లు వెలువెత్తుతున్న వేళ.. అధికార ఎన్డీయేలో ఈ అంశం కుంపట్లు రాజేస్తోంది. ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జేడీయూ సైతం ఇదే డిమాండ్‌ని తెరపైకి తెచ్చింది. ఓబీసీల సంక్షేమంపై ఏర్పాటు చేసిన పార్లమెంటు కమిటీలో జేడీయూ చేరింది. కుల గణన కోసం ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటనతో గొంతు కలిపింది. బీజేపీ మిత్రపక్షమైన లోక్‌జనశక్తి పార్టీ (రాం విలాస్) కూడా ఇప్పటికే కులగణనకు మద్దతు ప్రకటించింది. దీంతో ఎన్డీయే ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. జాతీయ స్థాయిలో సామాజిక-ఆర్థిక కులగణన వల్ల ప్రజల స్థితిగతులు తెలుస్తాయని, తద్వారా సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అందించవచ్చని కాంగ్రెస్ మొదటి నుంచి చెబుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి నుంచి జాతీయ కులగణనకు డిమాండ్ చేస్తోంది. జేడీ(యూ) కూడా కలిసి రావడంతో మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి మరింత పెరిగింది. మోదీ 3.0 ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కులగణన విషయంలో నెమ్మదిగా ఉన్న జేడీ(యూ) ఇప్పుడు దాని కోసం డిమాండ్ చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి సంబంధించిన పార్లమెంటు కమిటీలో కులగణనపై చర్చ కోసం జేడీ(యూ) పట్టుబట్టింది. గతంలోనూ కులగణనకు జేడీ(యూ) అనుకూలంగా ఉంది. బీహార్‌లో తమ పార్టీ అధికారంలో ఉండటంతో కులాధారిత సర్వేను సీఎం నితీశ్ కుమార్ చేపట్టారు. సర్వే ఫలితాలు గతేడాదిలో వెలువడ్డాయి. ఆ రాష్ట్ర జనాభాలో 69శాతం మంది వెనుకబడిన వర్గాల వారని తేలింది. అయితే పదేళ్లకొకసారి జనగణన నిర్వహించడం ఆనవాయితీ కాగా కోవిడ్ కారణంగా 2021 నుంచి ఆ ప్రక్రియ వాయిదా పడతోంది. జనగణనకు కేంద్రప్రభుత్వం షెడ్యూల్ త్వరలో ప్రకటించబోతోంది కాబట్టి కులగణన డిమాండ్ బిగ్గరగా వినిపిస్తోంది. విపక్షాలతో పాటు తమ మిత్రపక్షాల నుంచీ తీవ్ర ఒత్తిడి ఎదురువుతుండటంతో మోదీ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. జనాభా లెక్కలతో పాటుగా కులగణనను చేపట్టేందుకు

- మిగతా 2 లో

పాలకులు ధరలపై మాట్లాడరేం?

- రేపటి నుంచి ధరల పెరుగుదలపై సీపీఐ ఆందోళన
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం తగదు
- సినీ నటి వ్యవహారంలో కఠిన శిక్షలుండాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: నిత్యావసరాల ధరలు నానాటికీ పెరిగిపోతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపకుండా ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేవలం ఎన్నికల సమయంలో తప్ప రాజకీయ పార్టీలు అధిక ధరలను గురించి ప్రస్తావించడం లేదన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సెప్టెంబరు 1 నుంచి ఏపీలోని అన్ని నియోజకవర్గాలలో పెరిగిన ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలనే తదితర డిమాండ్లతో పెద్దఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. స్థానిక దాసరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 'ధరల పెరుగుదలపై

- మిగతా 2 లో

శివాజీ విగ్రహం కూలడంపై ప్రధాని క్షమాపణ

ముంబై: మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో తాజాగా ప్రధాని మోదీ క్షమాపణలు తెలిపారు. "నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను" అని వెల్లడించారు. "ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అత్యాచార భారతం

ఉన్నావో నుంచి ఆర్జీ కర్ వరకు ఆడబిడ్డలకు రక్షణ కరువు

న్యాయం కోసం తప్పని పోరాటాలు- సంవత్సరాల నిరీక్షణ

న్యూఢిల్లీ: స్త్రీలను దేవతలుగా పూజించే భారతదేశం అత్యాచారాలకు కేరాఫ్‌గా మారింది. దేశంలో మహిళలకు రక్షణ కరవైంది. అత్యాచార కేసుల్లో న్యాయం కోసం సంవత్సరాల నిరీక్షణ... పోరాటాలు తప్పడం లేదు. ఏటా 30వేలకుపైగా అత్యాచారాలు నమోదవుతున్నాయంటే దేశ పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఉన్నావో మొదలు కథువా, హత్రాస్, కోల్‌కతా, బద్లాపూర్ తరహా ఘటనలతో మహిళల రక్షణకు చేసిన చట్టాలన్నీ నీరుగారిపోతున్నాయని స్పష్టంచేశాయి. గత సంవత్సర కాలంలో 31,516 అత్యాచార కేసులు నమోదవ్వడం ఇందుకు నిదర్శనం. కామక్రీడకు బాల్యం, కౌమారం, యవ్వనం బలవుతోంది. గంటకు 90 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని జాతీయ నేరాల నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)-2022 నివేదిక తెలిపింది. శిక్షలు పడిన కేసులు 27-28శాతం మేర ఉన్నాయని పేర్కొంది. రాజకీయ నేతల ప్రకటనలు, న్యాయం జరగడంలో జాప్యం, పోలీసుల అసమర్థత వంటివి ఈ పరిస్థితుల్లో మార్పు రాకపోకడానికి కారణాలవుతున్నాయి. హేయమైన నేరాలు జరిగినప్పుడు నిందాక్రీడను రాజకీయ నేతలు మొదలు పెడతారు. పరస్పరం దూషించుకుంటారు. ఉన్నావో నుంచి ఆర్జీ కర్ వరకు అమానుష, హేయమైన నేరాలు సభ్యసమాజం తలెత్తుకునేందుకు వీల్లేకుండా చేశాయి. అభంసుభం తెలియని పసివారి నుంచి చర్మం ముడతలు పడిన బామ్మల వరకు అత్యాచారానికి గురికావడం కలచివేస్తోంది. ఈ దేశం ఎటుపోతోందన్న ప్రపంచ స్థాయి చర్చకు తావిస్తోంది.

హత్రాస్

2020, సెప్టెంబరు 14న 19ఏళ్ల దళిత యువతి ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో సామూహిక అత్యాచారానికి గురయ్యారు. నాలుకను కోసివేయగా శరీరమంతా గాయాలతో రక్తం మడుగులో పడివున్న ఆమెను తల్లి గుర్తించారు. కొన్ని రోజుల పాటు మృత్యువుతో పోరాడిన బాధితురాలు సెప్టెంబరు 29న చనిపోగా 30వ తేదీన అర్ధరాత్రి సమయంలో అంత్యక్రియలను పోలీసులు బలవంతంగా

- మిగతా 2 లో

ఉచిత ఇసుకపై రోజువారీ సమీక్ష

- పట్టాభూముల నుంచి సేకరణపై త్వరలో జీవో
- కలెక్టర్లతో గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పట్టా భూముల నుంచి ఇసుక సేకరణ అనుమతులపై త్వరలో జీఓ ఇవ్వనున్నామని, రవాణా చార్జీలు మినహాయించి రాష్ట్ర వ్యాప్తంగా ఏకీకృత ధర అమలులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో శుక్రవారం కలెక్టర్లతో... ఉచిత ఇసుక విధానం, సెప్టెంబరు 11 తేదీ నుంచి అమలుకానున్న నూతన విధానాలపై సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉచిత ఇసుక

- మిగతా 2 లో

నేను గెలిస్తే ఐవీఎఫ్ ఉచితం 2లో

మౌరీ రాజు కన్నుమూత

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌లోని మౌరీ రాజు కింగ్గి తుహెయిటియా పూటాటౌ టె వేరోవేరో-8 (69) కన్నుమూశారు. ఆయన గుండెకు శస్త్రచికిత్స జరిగింది. కోలుకుంటారని అంతా భావించగా శుక్రవారం కుటుంబ సభ్యుల సమక్షంలో తుదిశ్వాస విడిచారు. రాజు మరణాన్ని స్థానిక మీడియా ప్రకటించింది. ఇటీవల తన నాయకత్వానికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. తుహెయిటియా అంత్యక్రియలు వచ్చే గురువారం జరగనున్నాయి. అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత ఆయన వారసుడిని ప్రకటిస్తారు. తుహెయిటియా మౌరీ ఏడవ రాజు. ఆయనను ఐక్యత, స్వయంసమృద్ధికి చిహ్నంగా మౌరీ మంత్రి టామా పొటాకా కొనియాడారు. న్యూజిలాండ్ ప్రజల సంక్షేమానికి, శ్రేయస్సుకు ఆయన కట్టుబడ్డారన్నారు. రాజు మరణానికి సంతాప సూచికంగా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక భవనాలపై పతకాలను అవనతం చేశారు. కాగా, ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ శనివారం తుహెయిటియా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తారని అధికారులు తెలిపారు.

నేను గెలిస్తే ఐవీఎఫ్ ఉచితం

అణ్వస్త్రాల నివారణ అతిపెద్ద సవాల్

మిచిగన్, విస్కాన్సిస్ కార్యక్రమాల్లో ట్రంప్

పాటర్‌విల్లే/వెల్లింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో తనను గెలిపిస్తే మహిళలకు ఉచితంగా ఐవీఎఫ్ చికిత్స అందిస్తానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మిచిగన్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఐవీఎఫ్ సేవలను ఉచితం చేస్తా, అందుకు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని లేదంటే మీ బీమా కంపెనీలు చెల్లిస్తాయి' అని అన్నారు. 'మనకు మరింత మంది పిల్లలు కావాలి. నేను శ్వేతసౌధంలో అడుగు పెట్టిన తర్వాత అందరికీ ఐవీఎఫ్ చికిత్సను ఉచితం చేస్తా' అని ప్రకటించారు. సంతానలేమి సమస్య అధికంగా ఉన్న దృష్ట్యా ఐవీఎఫ్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. అలాగే విస్కాన్సిస్ రాష్ట్రంలోని టౌన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ అణ్వస్త్రాల వినియోగాన్ని నివారించడమన్నది అతిపెద్ద సమస్యగా ఉందని ట్రంప్ అన్నారు. 'సమీప భవిష్యత్‌లో అణు యుద్ధాన్ని నిరోధించడమన్నది అమెరికాకు, అంతర్జాతీయ సమాజానికి అతిపెద్ద సవాలు. అణ్వాయుధాలు ప్రమాదకరం. వాటి వల్ల సంభవించే వినాశనాన్ని ఊహించలేం. ఆ ఆయుధాలు ఎప్పటికీ వినియోగించకుండా చేయాలి' అని తెలిపారు. ప్రపంచ సుస్థిరతకు దౌత్య పద్ధతిని/సంప్రదింపుల విధానాన్ని అనుసరిస్తానని చెప్పారు. విజ్ఞతతో వ్యవహరిస్తా... ఫోన్‌లు చేయడం ద్వారా సత్సంబంధాలను ఏర్పాటు చేసుకుంటా' అని అన్నారు. అమెరికా, రష్యా అతిపెద్ద అణుశక్తులు కాగా వచ్చే ఐదేళ్లలో చైనా కూడా ఈ జాబితాలో చేరగలదని అంచనా వేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అణ్వాయుధాల నిరోధానికి సంబంధించి రష్యాతో చర్చలను ట్రంప్ జరుపుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

నా కేబినెట్‌లో రిపబ్లికన్‌కు అవకాశమిస్తా

హారిస్

సావన్నా: దేశం కోసం కొత్త పథాన్ని ఎంచుకునేందుకు అమెరికన్లు సంసిద్ధమయ్యారని డెమొక్రాట్ పార్టీ తరపు అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న కమలా హారిస్ అన్నారు. అధికారంలోకి వస్తే కేబినెట్‌లో రిపబ్లికన్‌కు స్థానం కల్పిస్తామని ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను మరిచి, కొత్త పథంలో ముందుకు సాగేందుకు అమెరికన్లు నడుంబిగించారన్నారు. గత దశాబ్దంగా ఒక అజెండా కోసం ఒత్తిడి తెస్తున్న వారు మాజీ అధ్యక్షుడు కావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. అధ్యక్ష అభ్యర్థిగా ఇచ్చిన తొలి ఇంటర్వ్యూలో ఆమె ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన తనపై చేసిన విమర్శలను తిప్పికొట్టారు. అలాగే అక్రమ చొరబాట్లను ఉపేక్షించబోనన్నారు. ఉదారవాద విలువలను విడనాడనని చెప్పారు. తన వైఖరిలోగానీ సిద్ధాంతాలు, విలువలలోగానీ మార్పు రాబోదని నొక్కిచెప్పారు. 'అధ్యక్షురాలిగా నేను ఫ్రాక్లింగ్‌ను నిషేధించను' అంటూ పెన్సిల్వేనియాతో వివాదానికి తెర దించే ప్రయత్నాన్ని చేశారు. మెక్సికన్ సరిహద్దు వెంబడి చొరబాట్ల విషయంలో కమలా హారిస్ ఉదారంగా ఉంటారన్న ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చుతూ అధ్యక్షురాలిగా కఠిన చట్టాన్ని అమల్లోకి తెస్తానని ఆమె నొక్కిచెప్పారు. గాజాలో కాల్పుల విరమణకు పిలుపునిచ్చారు. అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయిల్‌కు సంబంధించి దేశాధ్యక్షుడు జోబైడెన్ అనుసరించే విధానాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని కూడా కమలా హారిస్ స్పష్టంచేశారు.

అత్యాచార భారతం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. వార్త సేకరణకు వెళ్లిన కేరళ జర్నలిస్టు సిద్దీఖీ కప్పన్‌ను నిర్బంధించడం మరో వివాదానికి తెరతీసింది.

హైదరాబాద్

2019 నవంబరులో 20ఏళ్ల వైద్యురాలిపై నలుగురు అత్యాచారానికి పాల్పడ్డారు. హైవే టోల్‌ప్లాజా వద్ద ఆమె స్కూటీ పంక్చర్ చేసి, పొదల్లోకి ఈడ్చుకెళ్లి హత్యాచారానికి ఒడిగట్టారు. లారీ డ్రైవర్లు, వారి సహాయకులు నలుగురిని సీసీటీవీ ఫుటేజి ఆధారంగా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. డిసెంబరు 5న సీన్ రిక్రియేట్ సమయంలో ఆ నలుగురిని కాల్చిచంపారు. పోలీసుల చర్యను జనం స్వాగతించారు.

కథువా: బఖెవాల్ వర్గానికి చెందిన కుటుంబాన్ని తరిమివేయడం కోసం 2018 జనవరిలో ఎనిమిదేళ్ల బాలికపై కథువాలోని ఆలయ అర్చకుడు హత్యాచారానికి ఒడిగట్టాడు. సాక్ష్యాధారాలు నాశనం చేసిన ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులు సహా ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అర్చకుడు సంజీ రామ్ ప్రధాన నిందితుడని తేలడంతో... అతనితో పాటు మరో ఇద్దరికి 25ఏళ్ల శిక్ష పడింది.

ఉన్నావో: అధికార దుర్వినియోగానికి నిదర్శనగా ఉన్నావో ఘటన నిలిచింది. ఇంట్లో పని అమ్మాయిపై బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగర్ 2017 జూన్ 4న అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటన జరిగిన రెండు నెలల తర్వాత సీఎం యోగి ఇంటి ముందర బాధితురాలు నిప్పంటించుకోవడంతో నేరం వెలుగులోకి వచ్చింది. అధికారంలో ఉన్న వ్యక్తి యంత్రాంగాన్ని ఏ విధంగా ప్రభావి తం చేయగలడో ఈ కేసు ప్రతిబింబించి ంది. 2018 ఏప్రిల్‌లో బాధితురాలి తండ్రి కస్టడీలో చనిపోయారు. సినీఫక్కీలో బాధితురాలి, ఆమె ఇద్దరు అత్తలు, లాయర్ వెళుతున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఇద్దరు అత్తలు అక్కడికక్కడే చనిపోగా బాధితురాలు, ఆమె న్యాయవాదికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన జరిగిన రెండేళ్లకు బీజేపీ నుంచి కుల్దీప్ బహిష్కరణకు గురయ్యారు. 2020లో ఆయనకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది.

నిర్భయ

2012, డిసెంబరు 16వ తేదీ రాత్రి స్నేహితుడితో కలిసి ఇంటికి వెళుతున్న నిర్భయపై బస్సులో సామూహిక అత్యాచారం అత్యంత పాశవికంగా జరిగింది. వివస్త్రరాలిని నడిరోడ్డుపై పడవేసి దోషులు పరారయ్యారు. ఆమె 17 రోజులు మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచారు. సింగపూర్‌కు ఎయిర్ లిఫ్ట్ చేసినా ఫలితం లేకపోయింది. తీహార్ జైల్లో నలుగురు దోషులను ఉరితీశారు. 2015 తర్వాత ఉరి శిక్ష అమలు కావడం ఇదే మొదటిసారి. అప్పట్లో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఆ తర్వాత నిర్భయ చట్టం వచ్చింది.

పార్క్ స్ట్రీట్, కోల్‌కతా

2012 ఫిబ్రవరిలో కోల్‌కతాలోని నైట్‌క్లబ్‌లో స్నేహితులను కలిసేందుకు వెళ్లిన యువతిపై అత్యాచారం జరిగింది. కదలుతున్న కారులో నగరమంతా తిప్పుతూ ఆమెను రాత్రంతా లైంగికంగా వేధించారు. పోలీసులను ఆశ్రయిస్తే వారు బాధితురాలి చరిత్రపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇది బూటకపు కేసని బెంగాల్ సీఎం అప్పట్లో వ్యాఖ్యానించారు. రాజకీయ నేతలు, ప్రముఖులతో సంబంధాలు ఉన్న తన దోషులను శిక్షించేందుకు ఆమె సుదీర్ఘ పోరాటాన్ని సాగించారు. మెనింగిటిస్ వ్యాధితో 2015లో ఆమె చనిపోయారు. ప్రస్తుతం ఆర్జీ కర్ ఆసుపత్రి వైద్యురాలిపై సామూహిక అత్యాచారం కలకలం రేపింది. వైద్యురాలికి న్యాయం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకోసం ఎన్ని రోజు... ఎన్నాళ్లు వేచిచూడాలో అన్న సందేహం వ్యక్తమవుతోంది.

పాలకులు ధరలపై మాట్లాడరేం?

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ ఆందోళన' కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్‌తో కలిసి రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ 2014లో గద్దెనెక్కినపుడు వంట గ్యాస్ రూ.400 ఉండగా, నేడు రూ.950కి చేరిందన్నారు. నాడు లీటర్ పెట్రోలు రూ.60 ఉండగా, ప్రస్తుతం రూ.110కు, లీటర్ డీజిల్ ధర రూ.100కు చేరిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు 200 శాతం పెరిగాయని, కిలో బియ్యం రూ.70, కందిపప్పు రూ.210, వేరుశనగనూనె రూ.220కు చేరడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. విద్యుత్ చార్జీలు అధికంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు, పేద వర్గాలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కేవలం నాసిరకం బియ్యం పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నాయే తప్ప 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక డిపోల ద్వారా పంపిణీ చేయడం లేదన్నారు. చాలా కాలంగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవటంతో పేదలు కష్టాలు పడుతున్నారని చెప్పారు. జనాభా గణన జరగలేదనే సాకుతో కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదన్నారు. ధరల తగ్గింపు, రేషన్ కార్డుల మంజూరుపై సీపీఐ అధ్వర్యంలో సెప్టెంబరు 1 నుంచి 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆందోళన కార్యక్రమాలు, సెప్టెంబరు 6న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్దఎత్తున ధర్నాలు నిర్వహించనున్నామని, ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో పూర్తిస్థాయి మెజారిటీ సాధించిన చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీలను, ఎంపీలను టీడీపీలో చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పెద్దల సభగా గౌరవింపబడే రాజ్యసభ సభ్యులు అమ్ముడుపోయి పార్టీలు మారుతున్నారంటే ఇంతకంటే నీచమైన విషయం ఏదీలేదన్నారు. రాష్ట్రంలో అధికార కూటమికి 164 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, వైసీపీకి కేవలం 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, దీంతో జగన్‌మోహన్ రెడ్డికి అసెంబ్లీకి రావడానికి మనసొప్పడం లేదన్నారు. రాజ్యసభ, లోక్‌సభల్లో ఉన్న వైసీపీ పార్లమెంటు సభ్యులంతా 10 ఏళ్లుగా మోదీ ప్రభుత్వానికే మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా చంద్రబాబు ప్రభుత్వాన్ని విమర్శించలేదని, చంద్రబాబుకు సీనియర్ రాజకీయ వేత్తగా, ముందుచూపు ఉన్న నేతగా, పరిపాలనా దక్షుడుగా పేరుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారనే నమ్మకంతో ప్రజలు తీర్పునిస్తే దాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. తరచూ యువత గురించి మాట్లాడే చంద్రబాబు నాయుడు రాబోయే యువతరానికి, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారికి పార్టీ ఫిరాయింపులనే సందేశంగా పంపనున్నారా? అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబు అధికారంలో ఎవరుంటే వాళ్లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. గంధపు చెక్కల స్మగ్లర్ బీజేపీలో చేరతానంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి 'బీజేపీలో స్మగ్లర్లను, నేరగాళ్లకు అవకాశమివ్వమని చెప్పకుండా, బీజేపీ జిల్లా, రాష్ట్ర కమిటీల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని' చెప్పడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్టీఆర్ కూతురిగా గౌరవింపబడే పురందేశ్వరి స్మగ్లర్లను, నేరగాళ్లను బీజేపీలో చేర్చుకోవాలనుకోవడం సరైంది కాదన్నారు. ప్రజాతంత్ర వాదులంతా అనైతిక రాజకీయాలను, పార్టీ ఫిరాయింపులను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

ముంబై నటి వివాదం గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు రామకృష్ణ సమాధానమిస్తూ ముంబై నటి వివాదంలో పెద్ద పెద్ద వారి ప్రమేయం ఉన్నట్లు వార్తలొస్తున్నాయని, ఆమె సినీ నటి అయినా, టీవీ నటిగానీ, నటి కాకపోయినప్పటికీ ఒక మహిళపై జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరగాలన్నారు. ఇందులో ఎవరు ప్రమేయం ఉన్నప్పటికీ వారిపై కఠిన శిక్షలు ఉండాలన్నారు. అదే పోలీసు అధికారుల ప్రమేయం ఉంటే మాత్రం కచ్చితంగా శిక్షలు మరింత కఠినంగా ఉండాలన్నారు. ఖాకీ దుస్తులు వేసుకుని, ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్నామనే విషయాన్ని మరచి ప్రభుత్వ అనుకూలురుగా, వంధిమాగధలుగా మారిపోతున్నారన్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో కూడా పోలీసు అధికారులు, ఎమ్మెల్యేకి డబ్బులిచ్చి, పోస్టింగ్‌లు వేయించుకుంటున్న పోలీసులంతా డబ్బు కోసమే పనిచేస్తారన్నారు. గుంటూరులో ఎమ్మెల్యే భర్త ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు పెడతామని బెదిరించడాన్ని ఖండించారు. చంద్రబాబు తన ఎమ్మెల్యేలను, అధికారులను నియంత్రించాలని కోరుతున్నామన్నారు. సినీ నటి వ్యవహారంలో ఐపీఎస్‌లుగానీ, రాజకీయ నేతలుగానీ, అంతకు మించి ఎవరున్నప్పటికీ కఠిన చర్యలుండాలని, భవిష్యత్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మోదీకి నితీశ్ ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

యోచిస్తోంది. ఇదిలావుంటే, బీజేపీ ఎంపీ గణేశ్ సింగ్ అధ్యక్షతన వెనుకబడిన వర్గాల సంక్షేమానికి సంబంధించిన పార్లమెంటు కమిటీ తొలి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కులగణన అంశాన్ని డీఎంకే నేత బాలూ లేవనెత్తారు. కాంగ్రెస్ సభ్యుడు మాణికం ఠాకూర్ , టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తెలిపారు. కమిటీ చర్చించాల్సిన అంశాల్లో మొట్టమొదటిగా కులగణన ఉండాలన్నారు. కుల సర్వే నిర్వహించేలా కేంద్ర హోంశాఖకు లేఖ పంపాలని కమిటీని కోరారు. జేడీ(యూ) ఎంపీ గిరిధరీ యాదవ్ కూడా కులగణన కోసం పట్టుబట్టారు. కమిటీ జరిపే చర్చల్లో ఇందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలంటూ విపక్షాలతో గొంతు కలిపారు. మోదీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న పార్టీ విపక్షాలతో కలిసి కులగణన కోసం డిమాండ్ చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. జేడీ(యూ) నేత కేసీ త్యాగి ఓ వార్తపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ కులగణనకు మద్దతు తెలిపారు. కులగణన నిర్వహణకు తమ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. ఈ అంశంలో కేంద్రంతో వివాదాన్ని కోరుకోవడంలేదని కూడా ఆయన చెప్పారు.

కాగా, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలపై గతనెలలో లోక్‌సభ వేదికగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ 'అనురాగ్ ఠాకూర్ నన్ను అవమానించారు కానీ ఆయన నుంచి క్షమాపణను ఆశించడంలేదు. నేను సమరశంఖాన్ని పూరిస్తున్నా. మీరు నన్ను ఎంతగా అవమానించినా పర్వేలేదు. కులగణనకు ఈ సభ ఆమోదం తప్పక లభిస్తుందన్నది గుర్తుపెట్టుకోండి' అని అన్నారు. జనగణనకు సెప్టెంబరు నుంచి కసరత్తు మొదలవుతున్న నేపథ్యంలో కులగణనను నిర్వహించాలని కేంద్ర హోం వ్యవహారాల శాఖను ప్రతిపక్ష పార్టీల ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత ఇసుకపై రోజువారీ సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీలో రోజువారీ సమీక్షలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్ తరహాలోనే జిల్లాస్థాయిలో కూడా ఆయా కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎటువంటి రాజకీయ వత్తిడులకు లోనుకావద్దని, ఇదే విషయాన్ని సీఎం చాలా స్పష్టంగా చెప్పారని తెలిపారు. అన్‌లైన్ ద్వారా తమ ఇంటి నుంచే ఇసుక బుక్ చేసుకుని జీపీఎస్ విధానంలో తమ వాహనం లోకేషన్‌ను కూడా తెలుసుకోవచ్చన్నారు. అవగాహన లేని వారి కోసం సచివాలయంలో శిక్షణ పొందిన ఉద్యోగి అందుబాటులో ఉంటారన్నారు. కలెక్టర్లు ఇసుక లభ్యత, ధరలపై నిత్యం మీడియాకు బులెటిన్ విడుదల చేయాలని మీనా అదేశించారు. జిల్లాస్థాయి వ్యవహారాలకు జాయింట్ కలెక్టర్‌ను బాధ్యునిగా చేస్తామన్నారు. గనుల శాఖ సంచాలకులు ప్రవీణ్ కుమార్ ఇబ్రహీంపట్నం కమిషనరేట్ నుంచి, ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, ఏడీలు పాల్గొన్నారు.

మోదీ క్షమాపణ

(మొదటిపేజీ తరువాయి)

వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు" అని మోదీ మాట్లాడారు. శుక్రవారం మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

నేడు-రేపు వర్షాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వాయువ్య బంగాళాఖాతంలో అల్ప పీడనం బలపడింది. రాగల 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముంది. ఇది ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వైపు కదులుతూ వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ శుక్రవారం తెలిపింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడవచ్చని పేర్కొంది. శనివారం కోస్తా తీరం వెంబడి గంటకు 45-65కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వేటకు వెళ్లరాదని మత్స్యకారులను హెచ్చరించింది. దీంతో ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ రాష్ట్ర ప్రజలను అప్రమత్తం చేశారు. అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి నుంచి రాష్ట్రంలోని అనేక చోట్ల మోస్తరు వర్షం కురుస్తోంది.

రహస్య కెమెరాల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

రహస్య కెమెరాలను తమ హాస్టల్ విద్యార్థిని ఒకరు పెట్టినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. కళాశాల యాజమాన్యానికి విషయం తెలిపినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టామని తెలిపారు. వాష్ రూమ్‌కు వెళ్లాలంటే భయం వేస్తోందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కఠిన చర్యలు : మంత్రి కొల్లు రవీంద్ర

మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు కళాశాల వద్దకు చేరుకుని సమస్యపై విద్యార్థులతో చర్చించారు. కళాశాల యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని, మూడు రోజులుగా ఈ సంఘటన గురించి తెలిసినప్పటికీ యాజమాన్యం విషయాన్ని తొక్కి పెడుతుతోందని, దీనిపై ఫిర్యాదు చేసే వారిపై చర్యలు ఉంటాయని కళాశాల యాజమాన్యం బెదిరించారని విద్యార్థులు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తెచ్చారు. తమకు ఎట్టి పరిస్థితుల్లో న్యాయం జరగాలని, అంతవరకు కళాశాలకు వెళ్లమని విద్యార్థులందరూ ముక్త కంఠంతో నినాదాలు చేశారు. ఈ సంఘటనలో వాస్తవాలు వెలికితీసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ విషయం చాలా తీవ్రంగా పరిగణిస్తున్నారని, బాధ్యులయిన వారు ఎంతటి వారైనా సరే వదిలేది లేదని స్పష్టం చేశారు. కళాశాల విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి సంరక్షణ కల్పిస్తామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని అన్నారు. ఈ సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వసతి గృహం వార్డెన్‌పై గానీ, కళాశాల యాజమాన్యంపై గాని తప్పనిసరిగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మరల ఇలాంటి సంఘటనలు జరగకుండా భయపడే విధంగా చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఉన్నారు.

జిల్లా ఎస్‌పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంఘటనపై ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందంలో అందరూ మహిళా పోలీసులే ఉన్నారన్నారు. గుడివాడ క్రైమ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.రమణమ్మను ప్రత్యేక అధికారిగా నియమించామన్నారు. ఆమెతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఐటీ కోర్ ఎస్సై మాధురి, కమ్యూనికేషన్ పోలీసు సిబ్బంది నలుగురు ఉన్నారన్నారు. ఈ కేసులో ప్రస్తుతానికి ఎవరైతే బాధ్యులుగా విద్యార్థిని, విద్యార్థి పేరు చెబుతున్నారో వారి సెల్‌ఫోన్, లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దాంట్లో ప్రతి చిన్న డాక్యుమెంటును శాస్త్రీయబద్ధంగా పరిశీలించడం జరుగుతుందని, దాంట్లో ఏ చిన్న మెటీరియల్‌గానీ, వీడియోగానీ ఉన్నఎడల దాన్ని గమనించి బాధ్యులపై వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక మీదట ఎవరు ఇటువంటి ఘాతుకాలు చేయడానికి సాహసించకుండా ఉండేవిధంగా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విచారణ ఎన్ఎల్‌జెడి (నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్) పరికరం ద్వారా క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. ఇక్కడ ఉన్న పరిస్థితుల దృష్ట్యా పోలీసు యంత్రాంగానికి కొంత వెసులుబాటు కల్పిస్తే అన్ని విధాల పరిశీలించి వాస్తవాలు వెలికితీస్తామన్నారు. విద్యార్థినులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జరిగిన ఘటనపై ఎటువంటి వివక్షకు తావు లేకుండా విచారణ చేస్తామని, ఘటనలో ఎంతటి వారు ఉన్నా కఠిన చర్యలు తప్పవన్నారు.

హాస్టల్‌లో ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు

వసతి గృహంలో విచారణ ప్రత్యేక అధికారి సీఐ రమణమ్మ, ఎస్సై పూర్ణ మాధురి నేతృత్వంలో పోలీసు బృందం విద్యార్థినులతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి వాష్ రూమ్‌ల్లో తనిఖీ చేశారు. హాస్టల్‌లోని ప్రతి ఫ్లోర్‌కు మహిళా కానిస్టేబుల్స్‌ను రక్షణగా నియమిస్తున్నట్లు జిల్లా ఎస్పీ గంగాధరరావు విద్యార్థులకు తెలిపారు.

సీఎం సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలకు వెళ్లాలని ఆదేశించారు. ఘటనపై వివరాలు సేకరించి పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సీఎం స్వయంగా ఫోన్ లో మాట్లాడి విచారణ సాగుతున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆందోళనను, ఆవేదనను పరిగణలోకి తీసుకుని పటిష్ట దర్యాప్తు జరపాలని ఆదేశించారు. రహస్య కెమెరాల ద్వారా వీడియోల చిత్రీకరణ జరిగిందన్న విషయంలో...నేరం రుజువైతే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. కళాశాల యాజమాన్యం, అధికారుల అలసత్వం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినుల వద్ద ఆధారాలు ఉంటే...నేరుగా తనకే పంపాలని ఆయన కోరారు. స్టూడెంట్స్ ఎవరూ అధైర్య పడవద్దని, తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆడబిడ్డల పట్ల తప్పుగా ప్రవర్తించారని తేలితే కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి మూడు గంటలకు ఒక సారి తనకు ఘటనపై రిపోర్ట్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

గుడ్లవల్లేరు కళాశాల ఘటనపై కఠిన చర్యలు

రామకృష్ణ డిమాండ్



విశాలాంధ్ర-విజయవాడ : గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వాష్ రూమ్‌ల్లో రహస్య కెమెరాలతో న్యూడ్ ఫోటోలు తీసి, బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు తెలుస్తోందని, విద్యార్థినుల ఫోటోలు తీసి, బ్లాక్‌మెయిల్‌కు కారకులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. దీనిపై విద్యార్థినులు చేపట్టిన ఆందోళనకు సీపీఐ తరఫున సంపూర్ణంగా మద్దతిస్తున్నామన్నారు. గుడ్లవల్లేరులో పర్యటించి బాధితుల పక్షాన నిలుస్తామని, వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని రామకృష్ణ తెలిపారు.

షూటర్ అవనికి స్వర్ణం

(మొదటిపేజీ తరువాయి)

మహిళా క్రీడాకారిణిగా అవని నిలిచారు. అలాగే పతకం సాధించిన తొలి భారతీయ స్ప్రింటర్‌గా ప్రీతి చరిత్రకెక్కారు. మహిళల 100కిమీల రేసులో ప్రీతిపాల్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు భారత్‌కు మొత్తం నాలుగు పతకాలు వచ్చాయి. టోక్యో పారాలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్2లో స్వర్ణం గెలుచుకున్న అవని 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. అదే జోరుతో స్వర్ణం సాధించారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (ఎస్‌హెచ్ 1) షూటింగ్‌లో మోనా అగర్వాల్ కూడా మెరిశారు. ఆమె కాంస్య పతకాన్ని సాధించారు. షూటర్ మనీశ్ నర్వాల్ రజతం దక్కించుకున్నారు. శుక్రవారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో మనీశ్ మూడు పాయింట్లతో స్వర్ణ పతకాన్ని చేజార్చుకొని వెండితో సరిపెట్టుకున్నారు. ఆయన టోక్యో పారాలింపిక్స్‌లో 50 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణం సాధించారు. ఇదిలావుంటే, మహిళల 100కిమీల రేసులో ప్రీతి మూడవ స్థానంలో నిలవగా మొదటి, రెండవ స్థానాలను చైనా అథెట్లు గెలుచుకున్నారు.

న్యాయ చిక్కుల్లో టైట్లర్

(మొదటిపేజీ తరువాయి)

టైట్లర్‌ను అదే రోజు జడ్జి ప్రశ్నిస్తారు. తాను నిర్దోషినని టైట్లర్ చెబితేగనుక అభియోగాల నమోదు చేస్తారు. 1984, నవంబరు 1న గురుద్వారా పుల్ బంగస్ ఎదుట తెల్ల అంబాసిడర్ కారులో నుంచి దిగిన టైట్లర్ అక్కడున్న వారిని ఉసగొలిపినట్లు ప్రత్యేక సాక్షి చెప్పారని సీబీఐ తన చార్జిషీటులో పేర్కొంది. మన తల్లిని చంపిన సిక్కులను హతమార్చండని టైట్లర్ పిలుపుతో రెచ్చిపోయిన మూక ముగ్గురు సిక్కులను హతమార్చినట్లు వెల్లడించింది. ఇదే క్రమంలో టైట్లర్‌పై వివిధ సెక్షన్ల కింద అభియోగాల నమోదుకు న్యాయమూర్తి రాకేశ్ సియల్ తాజాగా ఆదేశాలు జారీచేశారు. సెప్టెంబర్ 13న జరగబోయే తదుపరి విచారణ రోజు కోర్టుకు హాజరు కావాలని టైట్లర్‌ను ఆదేశించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం ఢిల్లీలో అల్లర్లు చెలరేగాయి. పుల్ బంగాస్ ఘటనపై సీబీఐ 2023 మే 20న టైట్లర్‌పై అనుబంధ చార్జిషీటు దాఖలు చేసింది. దీంతో టైట్లర్‌కు సమన్లు జారీ కాగా 2023 ఆగస్టు 5న టైట్లర్‌కు బెయిల్ లభించింది.

సీఎంగా చంద్రబాబు తొలి ప్రమాణానికి 30 ఏళ్లు

1న రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు: మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు మొదటిసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసి సెప్టెంబరు ఒకటోతేదీ నాటికి 30 ఏళ్లు గడుస్తాయని, ఈ సందర్భంగా సామాజానికి ఆయన చేసిన సేవలను ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరగనున్నాయని పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ ఆశోక్ బాబు, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భరత్ మాట్లాడుతూ... చంద్రబాబు వంటి నాయకుడు మనకు దోరకడం అదృష్టమని అన్నారు. ఆయన ముందుచూపునకు ఎవరూ సాటిరారని స్పష్టం చేశారు. 1999లో సీఎంగా చంద్రబాబు ఎన్నికైన తరువాత ప్రతిఒక్కరూ ఆయనను సీఈఓ అఫ్ ఆంధ్రప్రదేశ్ అంటూ కితాబుచ్చేవారని అన్నారు. చంద్రబాబు విధానాలను దేశంలో అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని వివరించారు. 2019 ఎన్నికల్లో గెలిచి ఉంటే నవ్యాంధ్ర రాజధాని అమరావతి మరో విధంగా ఉండేదన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని అరాచక పాలన సాగిందని విమర్శించారు. సూపర్ సిక్స్‌ను సాధ్యమైనంత త్వరగా అమలు చేసేందుకే సీఎం ప్రణాళిక రూపొందిస్తున్నారని అన్నారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు నేటి తరానికి దార్శనికుడని అన్నారు. తెలుగు జాతి ఐక్యత, ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. జగన్ నైజం వారి శ్రేణులకు అర్థం అయిందని అందుకే రోజు రాజీనామాల పర్వం సాగుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో జగన్, విజయసాయిరెడ్డి, సజ్జల తప్పించి మరే నాయకుడు లేని పార్టీగా వైసీపీ నిలుస్తుందని ఎద్దేవా చేశారు. అశోక్ బాబు మాట్లాడుతూ భారతదేశ రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్ పేరులా.. చంద్రబాబు పేరు కూడా సువర్ణ అక్షరాలతో నిలుస్తుందని అన్నారు.

రేపు సీపీఎస్ అమలు విద్రోహ దినం: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సెప్టెంబర్ 1న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలు రోజును విద్రోహ దినంగా పాటిస్తూ నిరసనలు తెలపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. సెప్టెంబరు 1న ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ అమలైన రోజని గుర్తుచేశారు. ఈ మధ్యలో గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) ముందుకొచ్చిందన్నారు. పాత పెన్షన్ (ఓపీఎస్) అమలు చేయకుండా, ఇలాంటి ప్రత్యామ్నాయ విధానాలను వ్యతిరేకిస్తూ, జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని కోరారు.

బక్కచిక్కిన చెరువులు!

కబ్జాదారుల చెరలో చిక్కిశల్యం
ఆదాయవనరుగా మార్చుకున్న వైనం

విశాలాంధ్ర-లింగపాలెం: పకృతి సంపదను కాపాడుకోకపోతే భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. పకృతి విలయం సంభవిస్తే... మనలను మనం రక్షించుకోలేని స్థితిలో జీవిస్తున్నాం. అడవులు, కొండలు, గుట్టలు, చెరువులను రక్షించుకోలేకపోవడంతో తరచూ పకృతి విధ్వంసంలో చిక్కి సర్వం కోల్పోతున్నాం. కళ్లముందే పకృతి విలయంలో ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వాల్లో మాత్రం మార్పులు రావడం లేదు. జరుగుతున్న ఘోర నష్టం చెప్పనలవికానిది. కేరళలోని వయనాడ్ విలయం కళ్లముందు సాక్షాత్కరిస్తూనే ఉంది. చెన్నై, హైదరాబాదు నగరాలలో చెరువులు కనుమరుగవటంతో్ వర్షం వస్తే అడుగు బయట పెట్టలేని దుస్థితిని చూస్తున్నాం. నగరాలు, పట్టణాల్లోనే కాదు నేడు పల్లెల్లో అలాంటి పరిస్థితనే నెలకొంది. ఒకప్పటి రాజులు, పాలకులు నీటి అవసరాలను గుర్తించి చెరువులను తవ్వించారు. ఇప్పుడు చెరువుల రూపే మారిపోయింది. చిన్న పాటి గుంటలుగా తయారయ్యాయి. చెరువులను చిక్కిశల్యం చేసి వివిధ కాంక్రీట్ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో ఒకేసారి పట్టుమని పది దుక్కుల వర్షం పడితే చెరువుల్లో నీరునిల్వ ఉండేందుకు అవకాశం లేని దుస్థితి ఏర్పడింది. చెరువులు కనుమరుగవు తుండడంతో ప్రజల మనుగడే ప్రమాదంలో ఉందన టంలో అతిశయోక్తి లేదు. మెట్ట ప్రాంతాలలో జీవనాడులుగా ఉన్న చెరువులు బక్కచిక్కిపోతుంటే వీటిని కాపాడాలనే ధ్యాస పాలకుల్లో కరువైంది. చెరువులను కాపాడాలని పత్రికలు, ప్రజాసంఘాలు ఘోషిస్తున్నా ప్రభుత్వాల నుంచి సరైన పరిష్కారం లేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో1,214 చెరువులు ఉన్నాయి. లక్ష 14 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. 11.4 టీఎంసీల నీటి సామర్థ్యం చెరువులలో ఉండాలి. ప్రస్తుతం ఐదు టీఎంసీల సామర్థ్యం కూడా లేదని ఇరిగేషన్ అధికారులే అంటున్నారు. చెరువు గర్భాలకు చెందిన దాదాపు 14 వేల ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారుల అంచనా. ఆన్‌లైన విధానం ప్రవేశపెట్టకముందు చెరువులు, కాలువలకు సంబంధించిన స్థలాలను సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించిన సంఘటనలు అనేకం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. చెరువులో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉంటే పదివేల ఎకరాలు సాగు అవుతుంది. క్యూసెక్కు నీరు ఉంటే ఎనిమిది ఎకరాలను సాగు చేయవచ్చని ఇరిగేషన్ శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఎకరం చెరువు గర్భం విస్తీర్ణం ఉంటే మూడు క్యూసెక్కుల నీరు నిల్వ ఉంటుంది. దీని ద్వారా 24 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. చెరువు గర్భాల ఆక్రమణల తొలగించాలని సుప్రీంకోర్టు జోక్యంతో జీవో 188ని 2011 నవంబరులో ప్రభుత్వం విడుదల చేసింది. దీన్ని అమలు చేయడం లేదు. చెరువు గర్భాలను ఆక్రమించి సాగు భూమిగా మార్చుకొని పంటలు పండించుకునే వారు కొందరైతే చెరువులను మాయం చేసి నిర్మాణాలు చేస్తున్న వారు మరికొందరు. వందల ఏళ్లక్రితం నుంచి జీవనాడిగా ఉన్న చెరువులు కబ్జాదారులకు ఆదాయవనరుగా మారాయి. ఏలూరు జిల్లాలో 650 చెరువులు ఆయకట్టు కింద 60 వేల ఎకరాలు సాగవుతున్నాయి. గతంలో ఒకసారి నిండితే చెరువులో ఏడాదంతా నీటి నిల్వలు ఉండేవి. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. చెరువు గర్భాలు ఆక్రమణ వల్ల నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. మూడు నాలుగు సార్లు చెరువులోకి నీరు చేరినా మూడు నెలలకే ఖాళీ అవుతున్నాయి. సాగు భూములకు నీరు సంగతి అలాఉంచితే కనీసం పశువులకు తాగేందుకు నీరు దొరకని పరిస్థితి కూడా నెలకొంటుందని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. ఆయకట్టు రైతులు ఐకమత్యంగా ఆక్రమణలు తొలగించే కార్యాచరణ చేపట్టాలని సూచిస్తున్నారు. చెరువులను, కాలువలను రక్షించుకోకుంటే పకృతి విలయాల నుంచి బయటపడటం కష్టమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చంద్రబాబు ఇకనైనా మేల్కో: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల టాయిలెట్‌లో కెమెరాలు దాచి పెట్టిన ఘటనపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. విద్యార్థినుల జీవితాలను అతలాకుతలం చేసే ఈ ఘటనను తేలికగా తీసుకోలేమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా మేల్కోవాలని హితవు పలికారు. విద్యార్థుల భవిష్యత్, జీవితాలను పణంగా పెట్టొద్దని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో విద్యా వ్యవస్థలన్నీ దెబ్బతిన్నాయని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై నిర్లిప్తత, కళాశాలలపై పర్యవేక్షణ లోపం స్పష్టమైందని దుయ్యబట్టారు. విపక్షంపై బురద జల్లడంతో పాటు రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో ప్రభుత్వ పెద్దలు, యంత్రాంగం మునిగిపోయి పాలనను గాలికి వదిలివేశారని వ్యాఖ్యానించారు. కలుషిత ఆహారం కారణంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ సహా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో వందల మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారన్నారు. ఈ ఘటనలపై ప్రభుత్వ తీరు దారుణమన్నారు. ముఖ్యమంత్రి కొడుకే విద్యాశాఖ మంత్రి కావడంతో అసలు ఏమీ జరగలేదన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని జగన్ విమర్శించారు. పిల్లలకు నాణ్యతతో కూడిన ఆహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజూ ఒక మెనూతో పెట్టే మధ్యాహ్న భోజనం, గోరుముద్ద పథకాన్నీ ఘోరంగా మార్చేశారని జగన్ విమర్శించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని సీఎంకు సూచించారు.

బాత్‌రూముల్లో రహస్య కెమెరాలు దారుణం

కఠిన చర్యలు తీసుకోవాలి: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల బాలిక హాస్టల్ బాత్‌రూముల్లో రహస్య కెమెరాల అమానవీయ సంఘటనపై ప్రభుత్వం వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక ఆడబిడ్డ తల్లిగా ఈ ఘటన తనను తీవ్ర భయాందోళనకు గురిచేసిందని, చదువు, సంస్కారం నేర్పాల్సిన విద్యాసంస్థలు... పిల్లలకు ఏం నేర్పుతున్నాయోనన్న ఆలోచనలో పడేసిందన్నారు. ఆడ పిల్లల బాత్ రూముల్లో 300 రహస్య కెమెరాలు అందోళన కలిగిస్తోందన్నారు. ఈ ఘటనపై ఫాస్ట్రాక్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణం ఉన్నతస్థాయి కమిటీ వేయాలని, సీనియర్ ఐపీఎస్ అధికారులతో విచారించాలన్నారు. బాత్ రూముల్లో కెమేరాలు పెట్టిందెవరో తేల్చాలని స్పష్టం చేశారు. కెమేరాలు పెట్టింది ఎవరైనా... ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. బాత్ రూముల్లో రికార్డయిన ఏ వీడియోనూ పబ్లిక్ కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

జ్యుడీషియల్ కమిషన్ వేయాలి: ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినుల బాత్ రూముల్లో రహస్య కెమేరాలు పెట్టిన ఘటనపై జ్యుడీషియల్ కమిషన్ వేయాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు శిఖరం నరహరి, కార్యదర్శి జి. ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఘటనతో ఆడబిడ్డల తల్లిదండ్రులు కలవరం చెందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థినుల భద్రతా, భరోసా, రక్షణ కల్పించేందుకు వసతి గృహాల్లో ఘటనల నివారణకు చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. బిడ్డలు... లైంగిక దాడులు, అనారోగ్యం, మానసిక, శారీరక ఒత్తిళ్లతో ఆత్మ హత్యలు చేసుకుంటే సంబంధిత అధికారులను, యాజమాన్యాలను బాధ్యులను చేయాలని కోరారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలకు రూ.61వేల విరాళం

విశాలాంధ్ర-నూజివీడు: ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలకు విరాళంగా రూ.61వేలను రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావుకు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా తరఫున శుక్రవారం అందజేశారు. సెప్టెంబరు 1,2,3 తేదీల్లో విశాఖలో జరగబోయే ఈ సమ్మేళనాల జయప్రదానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాంగే, బుచ్చిబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉప ప్రధాన కార్యదర్శులు బుచ్చిబాబు, పుల్లారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు. అలాగే మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కృష్ణమాచార్యులు వ్యక్తిగతంగా రూ.25వేలు అందజేశారు. ఏలూరు పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రూ.20వేలు, నూజివీడు పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రూ.10వేలు, చింతలపూడి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రూ.4వేలు, జంగారెడ్డిగూడెం రూ.2వేలు చొప్పున అందజేశాయి. సమావేశాల ముగింపు సందర్భంగా నిర్వహించే సభ, ప్రదర్శనలో ఏలూరు జిల్లా నుంచి కార్మికులు పాల్గొనున్నారని నేతలు తెలిపారు.

జీవన్మరణ సమస్యగా కృష్ణా జలాలు

టి.లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా జలాల అంశం జీవనర్మరణ సమస్యగా మారిందని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 28,29 తేదీల్లో కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్) ఈ అంశంపై విచారణ ప్రక్రియను కొనసాగించింది. తెలంగాణ లేవనెత్తిన నీటి వివాదాన్ని విచారించడానికి 40 ముసాయిదా అంశాలను ఖరారు చేసిందని ప్రసారమాధ్యమాల్లో వార్తలొచ్చాయి. వాటి ప్రాతిపదికన విచారణను కొనసాగించడానికి తదుపరి విచారణను సెప్టెంబరు 20కి వాయిదా వేసింది. నీటి పంపకాల వివాదాలకు సంబంధించి సంబంధిత రాష్ట్రాలైన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ తమ తమ వాదనలు వినిపించాలి. సాక్ష్యాలను సమర్పించాలి. ట్రిబ్యునల్ తమకు సమర్పించిన సమర్పణలను సమీక్షిస్తుంది. చారిత్రక నీటి వినియోగం, పరివాహక ప్రాంతం కొలబద్ద వర్తిస్తుందా లేదా, భవిష్యత్ అవసరాలతో సహా ట్రిబ్యునల్ ముందుంచే సమాచారాన్ని విశ్లేషించి, తీర్పు ఇస్తుంది. అంతర్రాష్ట్ర నదీ జలాల వినియోగానికి సంబంధించి ట్రిబ్యునల్ తీర్పులే శిరోధార్యం. బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ కాలంలో తెలంగాణ రాష్ట్రం ఉనికిలో లేదని, పర్యవసానంగా తెలంగాణకు నీటి పంపకంలో నష్టం జరిగిందంటూ తెలంగాణ వాదిస్తున్నది. ఆ రెండు ట్రిబ్యునల్స్ విచారణ, అవార్డులు ఇచ్చినప్పుడున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు ఉనికిలో లేదు. గతంలో ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పులను రెండు రాష్ట్రాలకు శిరోధార్యమని ఆంధ్రప్రదేశ్ పున్వ్యవస్థీకరణ చట్టంలో విస్పష్టంగా పేర్కొన్నారు. అయినా, తెలంగాణ వివాదాన్ని లేవనెత్తింది. మోదీ ప్రభుత్వం ఆ వివాదంలోని హేతుబద్ధతను పరిగణనలోకి తీసుకోకుండానే బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువును పెంచి, విచారించి, తీర్పు ఇమ్మని బాధ్యత అప్పగించింది. తద్వారా, కృష్ణా జలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హక్కులపై కత్తి వేలాడుతున్నది. ఈ సమస్యను వివరిస్తూ ఐదు పేజీల వినతిపత్రాన్ని ఇ - మెయిల్, వాట్సాప్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉపముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రికి కూడా పంపాను. కరవు పీడిత రాయలసీమ ప్రాంతంలో దశాబ్ధాలుగా నిర్మాణంలో ఉన్న తెలుగు గంగ, హంద్రీ - నీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రంతి, ప్రకాశం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారింది. వినియోగంలో ఉన్న పురాతనమైన కృష్ణా డెల్టా ఆయకట్టులోని అత్యధిక భాగాలు, నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు, పురాతనమైన కర్నూలు - కడప కాలువ, తుంగభద్ర ఎగువ కాలువ, శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ, వగైరా ప్రాజెక్టులన్నీ కృష్ణా బేసిన్ బయట ఉన్న ప్రాజెక్టులని, వాటికి కేటాయించిన నీటిని తెలంగాణకు కేటాయిస్తూ పున: పంపిణీ చేయాలని తెలంగాణ అడ్డగోలుగా వాదిస్తున్నది. ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌కు ఎదురైనా ప్రభుత్వంలో కానీ, రాజకీయ పార్టీల్లో కానీ, పెద్దగా చలనం లేకపోవడం అత్యంత దురదృష్టకరం. ఇప్పటికైనా దృష్టిసారించి, ట్రిబ్యునల్ ముందు సమర్థవంతంగా వాదనలు వినిపించి, ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను పరిరక్షించకపోతే భావితరాలు క్షమించవని లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

టింబర్ డిపోల ద్వారా స్మగ్లింగ్

స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: టింబర్ డిపోల ద్వారా నర్సీపట్నం అటవీశాఖ అధికారులు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక డాక్టర్ ఎన్టీ రామారావు మార్కెట్ యార్డ్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ... అటవీ శాఖ అధికారుల స్మగ్లింగ్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశిస్తూ, అందుకు సంబంధించిన వివరాలను డీఎఫ్ఓకు అందజేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో 60 లక్షల మొక్కలు నాటినట్టు అధికారులు చెబుతున్నారని, క్షేత్రస్థాయిలో చూస్తే దీనికి భిన్నమైన పరిస్థితులుంటున్నాయన్నారు. గతంలో తాను అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో రెడ్ క్రాస్, గ్రీన్ క్రాప్, ఎన్‌సీసీ వంటి విద్యార్థి విభాగాలతో ప్రత్యేకంగా ఒకే రోజు లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాటన్నింటినీ పటిష్ఠం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లాలో నాలుగు లక్షల మంది డ్వాక్రా మహిళలను మొక్కల పెంపకంలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. అన్ని కళాశాలల్లో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు వెడల్పు సమయంలో చెట్లు నరికితే వాటిని తిరిగి పెంచేందుకు ప్రత్యేకంగా రోడ్డు పని బడ్జెట్ లోనే నిధుల కేటాయింపు జరిగేలా అనకాపల్లి జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలని కోరారు. మెడిసిన్ ప్లాంట్ తో పాటు వెదురు వనాలు పెంచాలన్నారు. విద్యార్థులు వారి ఇంటి పరిసర ప్రాంతాలలో మూడు మొక్కలను నాటి వాటి సంరక్షణ తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ విజయక్రిష్ణన్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి జగన్నాథ్ సింగ్, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జస్టిస్ శ్యామ్‌సుందర్ సేవలు ప్రశంసనీయం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బి.శ్యామ్ సుందర్ ఎన్నో సమగ్రమైన (కాంప్రెహెన్సివ్) కేసులు పరిష్కరించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. జస్టిస్ శ్యామ్ సుందర్ ఆదివారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టుహాల్లో వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ... జస్టిస్ శ్యామ్‌సుందర్ సేవలను ప్రశంసించారు. జస్టిస్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ... దేశంలో ఏ హైకోర్టుకు లేని విశిష్టత ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఉందన్నారు. ఉమ్మడి మద్రాసు హైకోర్టుగా... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా... విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా సేవలందించడం జరుగుతోందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన తాను 1986లో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని మొదలుపెట్టి అంచెలంచెలుగా ఈస్థాయికి చేరుకున్నట్టు చెప్పారు. తనకు తోడ్పాటును అందించిన తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, ప్రధాన న్యాయమూర్తి, సహచర న్యాయ మూర్తులు, న్యాయవాదులకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు ప్రసంగించారు.

తప్పుడు కేసు పెట్టి వేధించారు...

సీపీని కలిసిన నటి కాదంబరి జెత్వాని

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): అత్యాచారం కేసులో పోలీసుల ముందు హాజరయ్యేందుకు ముంబై సినీనటి కాదంబరి జెత్వాని... న్యాయవాదులతో కలిసి శుక్రవారం విజయవాడ వచ్చారు. ఎన్టీఆర్ జిల్లా సీపీ ఎస్వీ రాజశేఖరబాబును కలిశారు. ఈ కేసులో నిజానిజాలు తేల్చేందుకు ఏసీపీ స్రవంతి రాయ్‌ను సీపీ నియమించిన విషయం తెలిసిందే. ముంబై నుంచి జెత్వాని, ఆమె తల్లి ఉదయం విజయవాడ చేరుకున్నారు. నగరంలో ఓ హోటల్‌లో దిగారు. సాయంత్రం ఆమె తన న్యాయవాదులతో సీపీని కలిశారు. తప్పుడు కేసు బనాయించి నాటి పోలీసులు తనను, తన కుటుంబాన్ని ఏవిధంగా జైలుపాలు చేసిందీ సీపీకి పూసగుచ్చినట్టు చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే... కృష్ణాజిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన పారిశ్రామిక వేత్త కుమారుడు ముంబైలో ఓ పార్టీలో కాదంబరీ జత్వానీనిని కలిశాడు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. కుటుంబ సభ్యులు అభ్యంతరం చెప్పడంతో ఆమెను వదిలించుకునే ప్రయత్నం చేశారు. అందుకు ఆమె నిరాకరించింది. అప్పటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ నేత సహాయంతో ప్రేమ కథకు ముగింపు చెప్పాలకున్నారు. ఆ నేతతో సంప్రదింపులు జరిపి అప్పటి పోలీసు ఉన్నతాధికారులతో చేతులు కలిపారు. సుమారు రూ.ఐదు కోట్ల మేర డీల్ సెటిల్ చేశారని ఆరోపణలు. విజయవాడ పోలీసులు ముంబైకి వెళ్లి జత్వానీ కుటుంబాన్ని బెదిరించి విజయవాడ తీసుకువచ్చారు. ఓ గెస్ట్‌హౌస్‌లో బంధించి చిత్రహింసలు పెట్టారు. బెదిరింపులకు ఒప్పుకోకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి రెండో తేదీన సినీనటి, ఆమె తల్లిదండ్రులపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో 384, 385, 386, 388, 420, 467, 468, 471 రెడ్‌విత్ 120బీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వైసీపీ నేతలు... అప్పటి పోలీసు తీరుపై జెత్వానీ కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. చేసేదేమి లేక వారితో రాజీకి వచ్చారు. ఈ వ్యవహారంలో వెనక్కి తగ్గడంతో బెయిల్‌పై ముంబైకి పంపించారనే వాదలు వినిపించాయి. ఈ కేసులో పోలీసుల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెట్లు కొట్టనివ్వం... ఇదే మా విధానం

- జీవ వైవిధ్యానికి ఏపీ చిరునామా
- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- వనమహోత్సవంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: చెట్లు కొట్టనివ్వం... ఇదే తమ విధానం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని చెప్పారు. జీవ వైవిధ్యానికి రాష్ట్రం చిరునామా కావాలని, స్వచ్ఛమైన గాలి, నీరు అందరికీ అందుబాటులో ఉండాలని అన్నారు. వన మహోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణం ఎయిమ్స్ సమీపంలో ఉన్న ఎకో పార్కులో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం మొక్కలు నాటారు. వీవర్స్ కాలనీ హైస్కూల్ 10వ తరగతి చదువుతున్న వేదవాణిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వేదవాణిని శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ పచ్చదనం ఆవశ్యకత గ్రహించాలని అన్నారు. అటవీ ప్రాంతం క్రమంగా తగ్గిపోతుందని, పర్యావరణంలో పెనుమార్పులు వస్తున్నాయని, భూతాపం, పరిశ్రమలు, వాహనాల కాలుష్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పచ్చదనం 50 శాతానికి పెరగాలని, ప్రతిఒక్కరూ ఏటా రెండు మొక్కలు నాటాలని సూచించారు. మిషన్ హరితాంధ్రప్రదేశ్‌కు 2014లోనే శ్రీకారం చుట్టామని, డ్రోన్స్‌తో సీడ్ బాల్స్ వేసే కార్యక్రమాలు చేపడతామని వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో నగరవనాలు ఏర్పాటు చేసి జపాన్‌లోని మియాబకీ విధానంలో పచ్చదనం పెంచుతామని చెప్పారు. అమరావతిని సుందరమైన నగరంగా మార్చుతామని అన్నారు. వైసీపీ హయాంలో సహజ వనరులు ధ్వంసం చేశారని, నదులు, చెరువులు, కొండలను కొల్లగొట్టారని అన్నారు. అడవుల్లో తాము ఎర్రచందనం పెంచితే... వైసీపీ ప్రభుత్వం స్మగ్లింగ్ చేసిందని విమర్శించారు. రుషికొండను కొట్టేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టారన్నారు. అడవులను నరికితే కఠిన చర్యలు ఉంటాయని ఎర్రచందనం దొంగలను హెచ్చరించారు.

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పచ్చదనం పెంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, భావితరాల కోసం అందరూ మొక్కలు నాటాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టారీతిన చెట్లను నరికేసిందని, చెట్లు నరకడం తేలిక.. పెంచడమే కష్టమని అన్నారు. ఈ మహాయజ్ఞాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ చెట్లు పెంచాలని కోరారు. కోనసీమలో కొబ్బరి చెట్టును పెద్ద కొడుకుగా భావిస్తారని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మనిషి బతకాలంటే నీరు, చెట్లు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణకు చెట్ల పాత్ర చాలా ముఖ్యమైనదని అన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, చిరంజీవి చౌదరి, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముంబై నటికి న్యాయం చేస్తాం: సీఎం

ముంబై నటి జత్వానీని తీవ్రంగా హింసించారు. నటిపై బూటకపు కేసులు పెట్టి వేధించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు తొత్తులుగా వ్యవహరించారు. కాపాడాల్సిన పోలీసులే ఇలా చేస్తే... ఇంకా రక్షణ ఎవరు కల్పిస్తారు? ముంబైలో ఉండే నటిని ఇక్కడికి తీసుకువచ్చి వేధించారంటే... పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ముంబై నటి న్యాయం కోసం వచ్చింది.. ఆమెకు న్యాయం చేస్తాం అని చంద్రబాబు అన్నారు. ఎంత పెద్ద వారైనా వదిలిపెట్టమని, మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టం చేశారు.

ఉద్యోగుల బదిలీ గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉద్యోగుల బదిలీలకు మరో 15 రోజులపాటు గడువును పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబరు 15 వరకూ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 16వ తేదీ నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ, రోడ్లు, భవనాలు, రవాణా శాఖల బదిలీ మార్గదర్శకాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దృష్ట్యా గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గిరిజాశంకర్ నేడు పదవీ విరమణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీ పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ గిరిజా శంకర్ శనివారం (ఆగస్టు 31) పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్ చార్జి పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ గా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనాను నియమించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ముకేశ్ కుమార్ మీనా పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా మత్స్యకారులు వీక్షించారు. ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవంతో మత్స్యకారులు చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2018లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు దీనికి శంకుస్థాపన చేశారు. హార్బర్ మళ్లీ ఆయన హయాంలోనే అందుబాటులోకి రావడం సంతోషకరమని మంత్రి నారాయణ అన్నారు.రాష్ట్రంలోని తూర్పు తీరం మత్స్యకారులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి రావడంతో చేపల వేట సులువు కానుంది. అలాగే నిల్వ సమస్య తీరనుంది. ఎప్పటినుంచో పడుతున్న సమస్యలు తీరిపోతాయని మత్స్యకారులు అంటున్నారు. రూ.288 కోట్లతో నిర్మించిన హార్బర్‌కు 1250 బోట్లు నిలబెట్టే సామర్థ్యం ఉంది. దీని ద్వారా 9 మండల పరిధిలోని 98 మత్స్యకార గ్రామాల్లో ఉన్న 12 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరనుంది.ప్రకాశం -నెల్లూరు జిల్లా వరకు తీరంలో మత్స్యకారులు అనేక కష్టాలు పడుతున్నారు. దొరికిన చేపలను నిల్వ చేసుకునేందుకు వీలు లేక వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. తీర ప్రాంత మత్స్యకారుల కోసం 2018లో అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో రాష్ట్రంలో మూడో ఫిషింగ్ హార్బర్ సిద్ధమైంది.

సంపాదకీయం

రైతుల మెడకు స్మార్ట్ మీటర్ల ఉచ్చు

రోజురోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో విద్యుత్‌ను లాభసాటి అంశంగా భావించిన అంబానీ, అదాని లాంటి సంపన్నులు విద్యుత్ రంగంలోకి వస్తున్నారు. నిన్న మొన్నటి దాకా విద్యుత్ రంగంలో కేవలం ఉత్పత్తికే పరిమితమైన కార్పొరేట్ సంస్థలు నేడు పంపిణీ రంగంలోకి కూడా ప్రవేశిస్తున్నాయి. బొగ్గు గనులు, దిగుమతులు, ఓడరేవులు, రవాణా వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకున్న అదాని కంపెనీ ఇప్పుడు విద్యుత్ పంపిణీ రంగాన్నీ విడిచిపెట్టడంలేదు. రానున్న రోజుల్లో ప్రభుత్వరంగ సంస్థలు అయిన ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్ కనుమరుగై అదాని పవర్, అంబాని పవర్ అని ప్రజల ముందుకు వస్తాయా అనిపించే విధంగా పాలకుల విధానాలు ఉన్నాయి. విద్యుత్ రంగాన్ని బడా కంపెనీలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వాలు సంస్కరణలను తీసుకువస్తున్నాయనడంలో ఏమాత్రం సందేహంలేదు. రాజకీయ పార్టీలు కూడా అధికారంలో లేనప్పుడు ఒక మాట, అధికారం అందిపుచ్చుకున్న తరువాత మరో మాట మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకే లాభం చేకూర్చేలా పనిచేస్తున్నాయి. రాష్ట్రంలోని పాలక పార్టీల నేతలైన చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సంస్కరణలపై అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో వున్నప్పుడు మరోమాట మాట్లాడటం అలవాటుగా మారింది. చంద్రబాబు అయినా, జగన్ మోహన్‌రెడ్డి అయినా ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా బీజేపీ చెప్పిందల్లా చేస్తూ జనంపై భారం మోపుతున్నారు. రాష్ట్రంలో జూన్‌లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం విద్యుత్‌రంగాన్ని బలోపేతంచేసి ఆర్థిక, సాంకేతిక, సుస్థిరమైన, శక్తిమంతమైన, సమర్థమంతమైన వ్యవస్థను రూపొందించాలి అన్న మాటలకు విరుద్ధంగా పనిచేస్తున్నది. ప్రజలపై భారం పడేలా విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను నాడు వైసీపీప్రభుత్వం తీసుకువస్తే తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక వైఖరి మార్చుకున్నది. ఇప్పుడు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల అమలుకు పూనుకున్నది. నాడు వ్యతిరేకించి నేడు అమలు చేయడమేమిటన్న ప్రశ్నకు ప్రభుత్వాధినేతల నుంచి సమాధానంలేదు. ప్రజలను వివిధ రూపాల్లో దోపిడీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని వామపక్ష పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగిస్తే బద్దలు కొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ రైతులను రెచ్చగొట్టింది, అంతేకాకుండా హైకోర్టులో పిటిషన్లు కూడా వేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఒప్పందాన్ని రద్దు చేయకపోగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గతంలో వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్లను ఇప్పుడు కొనసాగించి వాగ్దాన భంగానికి పాల్పడుతోంది. విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం మేరకు ఇప్పుడు రాష్ట్రంలోని గోదాములకు స్మార్ట్ మీటర్లను అదాని కంపెనీ పంపుతోంది. అందులో భాగంగా నాలుగు కంటైనర్లలో ఈ స్మార్టు మీటర్లు ఇటీవల విజయవాడలోని సీపీడీసీఎల్ కార్యాలయానికి చేరుకోవడంతో విద్యుత్ స్మార్టు మీటర్ల అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది. రాష్ట్రంలో 1.5 కోట్ల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల మేరకు 27.68లక్షల స్మార్ట్ మీటర్లను అదాని రాష్ట్రానికి పంపితే రాష్ట్ర ప్రభుత్వం వాటిని స్వీకరించి విద్యుత్ కార్యాలయంలో అదానీ సంస్థకు స్థలం కేటాయింపు జరిపి అక్కడ భద్రపరిచింది. ఈ మీటర్లను వెనక్కి పంపి, విద్యుత్ కార్యాలయంలో అదానీ సంస్థకు స్థల కేటాయింపు నిలిపివేయాలన్న వామపక్షాల డిమాండ్‌ను పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఒత్తిడితో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకువస్తే నాడు వ్యతిరేకించిన టీడీపీ అధినేత నేడు అదే విధానాలను కొనసాగించడం చంద్రబాబు ద్వంద్వ విధానానికి అద్దంపడుతోంది. కేంద్రం ప్రవేశపెట్టిన సంస్కరణల్లో రాష్ట్ర ప్రభుత్వం భాగమై నిర్దేశిత మూడు విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి మధ్యప్రదేశ్ సంస్కరణలకు మునుం పట్టింది. తర్వాత విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలుచేసిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయించిన జగన్ ప్రభుత్వం వాటి పంపిణీ కాంట్రాక్టులను అదానీ, షిరిడి సాయి తదితర కంపెనీలకు కట్టబెట్టింది. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు మంజూరులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకున్నదని అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ప్రక్రియ అంతా అవినీతి మయమైందని ప్రజాసంఘాలు, రైతు సంఘాలు ఘోషిస్తున్నా ఏమాత్రం పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం ప్రస్తుతం విజయవాడతో సహా అనేక ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నది. వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాలలోను ఈ మీటర్లు బిగిస్తున్నారు. ఆ తర్వాత నివాస గృహాలకు బిగిస్తారని వార్తలు వెలువడుతున్నాయి. మొదటి దశలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్‌కు ఎసరుపెట్టే ప్రమాదం వుంది. నివాస గృహాలకు మీటర్లతో ప్రీపెయిడ్లో విద్యుత్ వాడే సమయాన్నిబట్టి అదనపు చార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వివిధ రూపాల్లో భారం వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. మీటర్ల పేరుతో వేలాదికోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోంది. కేంద్రం చెప్పిన సంస్కరణలు అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలకు రుణాలు అందుతుండడంతో ఈ సంస్కరణలు తప్పనిసరి అయ్యాయి.

విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తున్నందుకు వీలుగా ఆంధ్రాతోపాటు పది రాష్ట్రాలకు అదనంగా అప్పులు చేసుకునేందుకు కేంద్రం అనుమతిచ్చింది. ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద రుణాల కోసం ఈ నిబంధనలు తప్పనిసరిగా మారాయి. ఇన్నాళ్లు రైతులకు ఉచిత విద్యుత్ అందగా కేంద్ర సంస్కరణలతో మోటార్లకు మీటర్లు బిగించనున్నారు. దీంతో వ్యవసాయ విద్యుత్‌కు ఇక నుంచి లెక్క పక్కా కానుంది. ఇప్పటికే విద్యుత్ సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ లెక్కను తేల్చేపనిలో నిమగ్నమయ్యాయి. వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్ల బిగింపు కార్యక్రమం మొదలైంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ బోర్లకు మీటర్లను బిగిస్తే రైతులకు ఉచిత విద్యుత్ అందుతుందా? లేదా? మీటర్లు బిగిస్తే బిల్లులు చెల్లించాల్సిందేనా అనే అనుమానాలు రైతుల బుర్ర తొలిచేస్తున్నాయి. రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఆదానీ, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసే ప్రక్రియ నిలిపివేయాలి. ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించాలి. లేకుంటే విద్యుత్ సంస్కరణలు, చార్జీల పెరుగుదలకు వ్యతిరేకంగా 2000సంవత్సరంలో జరిగిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాల్సిన అవసరం ఉంటుంది. 24 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అనేక ఉద్యమాలకు ఆ విద్యుత్ ఉద్యమమే ప్రేరణగా వుంది.

అప్పులు రైతులకు- లాభాలు కార్పొరేట్లకు

కె.వి.వి. ప్రసాద్

భూమి మాయమవుతున్నది ఓరన్న !
రైతు మాయమవుతున్నాడు ఓరన్నా!!

రైతేరాజు- రైతే దేశానికి వెన్నుముక, రైతులేనిదే రాజ్యం లేదంటూ ఒకనాడు రైతన్నలను పాలకులు కీర్తించారు. కానీ నేడు రైతు అనే పదాన్ని మటుమాయం చేసే ప్రక్రియకు పాలకవర్గాలు శ్రీకారం చుడుతున్నాయి. 1936 ఏప్రిల్ 11న స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షులుగా, ఆచార్య ఎన్.జి.రంగా ప్రధాన కార్యదర్శిగా "అఖిల భారత కిసాన్ సభ" ఏర్పడింది. నాటి బ్రిటిష్ పాలకులు దేశంలో రైతాంగ వ్యతిరేక విధానాలు అమలుచేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న దశలో కిసాన్‌సభ నాయకత్వం సెప్టెంబరు1 (1936)న "డిమాండ్స్ డే" పాటించి ఆందోళనకు పిలుపు నిచ్చింది. నాటినుండి ఈనాటి వరకు కిసాన్‌సభ నేటి పాలకుల రైతాంగ విధానాలపై సమరశంఖం పూరిస్తూ రైతాంగాన్ని సమీకరించి అనేక విజయాలు సాధించింది. పాలకుల విధానాల పుణ్యమా అని రైతన్నల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి కేటాయింపులు తగ్గించి వేస్తున్నాయి. వ్యవసాయ సబ్సిడీలలో కోతపెడుతూ వ్యవసాయాన్ని భారంగా మార్చివేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు పెరిగిపోతూ వ్యవసాయం గిట్టుబాటుకాక 78శాతం మంది రైతులు వ్యవసాయాన్ని వదిలివేయాలని యోచిస్తున్నట్లు అర్జున్‌సేన్ గుప్తా కమిటీ వెల్లడించింది. వ్యవసాయం చేసేందుకు యువత ఏ మాత్రం ఆసక్తి చూపడంలేదని డెవలప్‌మెంట్ ఆఫ్ యూనిట్ (డి.ఐ.యు) తెలిపింది. వ్యవసాయంలో తగిన ఆదాయంరాని కారణంగా గ్రామీణ యువత వ్యవసాయంపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. సాగు ఏమాత్రం ఉపయోగం కాదని 63.8 శాతం పురుషులు, 62.7 శాతం మహిళలు చెప్పినట్లు ఆ సంస్థ పేర్కొన్నది. ప్రస్తుతం సాగుచేస్తున్న వారిలో 60శాతం మంది వ్యవసాయాన్ని వదిలేయాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ సర్వేలో వెల్లడైంది.

మరోవైపు ప్రభుత్వాలు పరిశ్రమల పేరుతో, అభివృద్ధి పేరుతో రైతులు, గ్రామీణ పేదల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ 2015లో కొత్త చట్టం తేవాలని విఫలయత్నంచేసి రైతులు, రైతు సంఘాలు, రాజకీయపార్టీల ఒత్తిడితో వెనక్కు తగ్గింది. 2014లో అధికారం చేపట్టిన ప్రధాని మోదీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను మక్కికి మక్కి అమలు చేస్తానని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వాగ్దానాలు చేశారు. కానీ రైతుల ఆదాయం పెంచే ప్రయత్నాలు చెయ్యకపోగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు తిలోదకాలిచ్చారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రతి రోజూ 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమౌతున్నది. రోజుకు 2 వేల మంది రైతులు వ్యవసాయాన్ని వదిలి గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు తరలిపోతున్నారు. అంటే రోజుకు ఒక గ్రామం ఖాళీ అవుతున్నదన్నమాట. గ్రామాలు పచ్చదనంతో ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమన్న మహాత్మాగాంధీ వ్యాఖ్యలకు విరుద్ధంగా ప్రస్తుత పాలకుల వైఖరి ఉన్నది. అందువల్లనే రైతు కూలీలు వ్యవసాయానికి దూరమై పట్టణాలకు తరలిపోతున్నారు.

ప్రభుత్వాలు పరిశ్రమల పేరుతో, అభివృద్ధి పేరుతో రైతులు, గ్రామీణ పేదల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ 2015లో కొత్త చట్టం తేవాలని విఫలయత్నంచేసి రైతులు, రైతు సంఘాలు, రాజకీయపార్టీల ఒత్తిడితో వెనక్కు తగ్గింది. 2014లో అధికారం చేపట్టిన ప్రధాని మోదీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను మక్కికి మక్కి అమలు చేస్తానని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వాగ్దానాలు చేశారు. కానీ రైతుల ఆదాయం పెంచే ప్రయత్నాలు చెయ్యకపోగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు తిలోదకాలిచ్చారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రతి రోజూ 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

మరో పక్క దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, బడా కాంట్రాక్టర్లు, సినీరంగ ప్రముఖులకు బ్యాంకులు రుణ సహాయం ఇబ్బడి ముబ్బడిగా అందిస్తున్నాయి. వ్యవసాయరంగానికి అవసరమైన రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు శ్రద్ధ చూపడంలేదు. పాలకుల వైఖరి ఇందుకు తోడ్పడుతున్నది. 142 కోట్లమంది ప్రజానీకానికి తిండి గింజలు పండించే 15 కోట్ల మంది రైతన్నలను వ్యవసాయంలో నిలబెట్టాలనే యోచన పాలకులకు కొరవడింది. అష్టకష్టాలు పడుతూ ఎండ, వాన, ప్రకృతి వైపరీత్యాలకు గురౌతూ వ్యవసాయం భారమై రుణ గ్రస్థులౌతున్నా రైతులను ఆదుకుందామనే కనీస విజ్ఞత మన సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు కోల్పోతున్నారు. ఫలితంగా రైతులు భూమికి దూరమౌతున్నారు. భూములను కౌలుకు ఇస్తూ ఇతర వ్యాపకాలకు మళ్ళుతున్నారు. కౌలు రైతులే వ్యవసాయరంగానికి మూల స్తంభాలుగా మారుతున్న పరిస్థితి నెలకొంది. కౌలు రైతును ఆదుకునేందుకు ప్రభుత్వాలు అవసరమైన చట్టాలు రూపొందించడంలో విఫలమౌతున్నాయి.

పాలకవర్గాల విధానాల ఫలితంగా ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. 2000 సంవత్సరంలో కేవలం తొమ్మిది మంది బిలియనీర్లు (100 కోట్లకు పైబడిన సంపద కలిగినవారు) వీరి సంఖ్య 2017 నాటికి 101, 2022 నాటికి 166కి పెరిగింది. మోదీ ప్రధానిగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి కార్పొరేట్లకు వివిధ రూపాలలో లబ్ధి చేకూర్చే విధానాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగమే మూడు నల్ల వ్యవసాయ చట్టాలు, విద్యుత్ బిల్లు. 13 మాసాలపాటు నల్లచట్టాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక పోరాటం నిర్వహించిన భారత రైతాంగ ఉద్యమ ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు చట్టాలను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. ఆందోళన విరమణ సందర్భంగా రైతు సంఘాలకు పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చింది. కానీ నేటివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చెయ్యకపోవడం మోదీ ప్రభుత్వ మోసకారితనానికి నిదర్శనం. ఇది కార్పొరేట్లకు భూములను కట్టబెట్టే ప్రయత్నంలో భాగమే. వ్యవసాయ ఫలితాలను రైతాంగానికి అందకుండా కార్పొరేట్లపరం చేయాలనే దుష్ట ఆలోచనే. ప్రకృతి వైపరీత్యాలవల్ల, తెగుళ్ళవల్ల పంట నష్టాలు సంభవించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతాంగానికి ఒక్క పర్యాయం రుణమాఫీ చేయాలని రైతుసంఘాలు ఉద్యమిస్తున్నా మోదీ ప్రభుత్వానికి పట్టడంలేదు. కానీ బడాబాబులకు 14.56 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. కట్టగలిగిన స్థితిలో ఉండి ఉద్దేశ పూర్వకంగా రుణాలు ఎగవేస్తున్నారని బ్యాంకులు స్పష్టం చేసినా వారికి సైతం 79 వేల కోట్లు మోదీ ప్రభుత్వం మాఫీ చేయించింది. 2014 నాటికి ప్రభుత్వ బ్యాంకులు సగటున సంవత్సరానికి 7,187 కోట్లు మాఫీ చెయ్యగా 2023 నాటికి సగటున 1.27 లక్షల కోట్లు మాఫీ చేశాయి. అలాగే ప్రైవేటు బ్యాంకులు ప్రతి సంవత్సరం 4,115 కోట్ల నుంచి 84వేల కోట్లకు అంటే సుమారు 20 రెట్లుగా రుణాలను మాఫీ చేశాయి. ఈ రుణమాఫీ పొందిన వారిలో 95శాతం మంది నరేంద్ర మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌కు చెందిన బడాబాబులే. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగంచేస్తూ ఈ దేశ ప్రజలకు తిండిగింజలు పండించే రైతన్నలను పూర్తిగా విస్మరిస్తున్నది. అనీల్ అంబానీ, అదానీలాంటి కంపెనీలకు మోదీ ప్రభుత్వం సలాములు కొడుతున్నది. రైతే రాజుగా కీర్తించాల్సిన రైతును మాత్రం పూర్తిగా విస్మరిస్తున్నది.

ఈ పరిస్థితుల్లో వ్యవసాయంలో రైతును నిలబెట్టాలి. భూమి కార్పొరేట్లపరం కాకుండా జాగ్రత్త వహించడం ఈ దేశ ప్రజలందరి బాధ్యత. పాలకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మి రైతాంగం మోసపోకుండా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి. మేడినిపట్టే రైతన్న నీ చేతికి దండం. కూడుపెట్టే నీ కాళ్ళకు దండం. మాయమాటలతో నీ మెడపై కత్తిపెట్టే కసాయి పాలకుల మాటలు నమ్మవద్దు. సెప్టెంబరు 1 డిమాండ్స్ డే స్ఫూర్తితో సమరశంఖం పూరిద్దాం. బడా బాబులైన కార్పొరేట్ల నుంచి వ్యవసాయాన్ని కాపాడుకుందాం. రైతాంగ డిమాండ్స్‌ను ప్రచారం చేద్దాం. రైతుసత్తాను చూపిద్దాం.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి
సెల్: 9490952737

సృజనా...!? ధైర్యమా...!?

రచన సృజనాత్మకంగా ఉండాలి. రచన ఆలోచించేలా ఉండేలి. రచన మనిషి వికసించేలా ఉండాలి. ఓ పాట విన్నాక ఉవెత్తున ఎగిసిపడాలి. మరో పాట విన్నాక మనసంతా కరుణాత్మకంగా మారాలి. ఇంకో పాట విన్నాక అమ్మ లాలిపాటలా హాయిగా నిద్రపోవాలి. పాట రాసిన వాళ్లో, పాడిన వాళ్లో కాదు అది విన్న వారిలో ధైర్యం నిండాలి. మంచి పద్యం చదివాక జీవిక మీద నమ్మకం పెరగాలి. ఏలికల మీద కోపంతో ఉరమాలి. కథ చదివిన తర్వాత మనం ఇలా బతుకుతున్నామా అని ప్రశ్నించుకోవాలి. అలా బతకలేకపోతున్నామా అని ఆందోళన చెందాలి. నవల చదివాక నిలువెల్లా కరిగి కన్నీటి పుట్ట కావాలి. మంచి విమర్శ చదివాక అలా రాయకూడదా అని కలత చెందాలి. ఇలా రాయాలా అని ఎరుక కలగాలి. మాతృభాషే కాదు... ఏ భాషలో సాహిత్యమైనా ఇలాంటి అనుభూతే కలగాలి. అలా కలిగినప్పుడే అది ఉత్తమ సాహిత్యంగా నిలబడుతుంది. ఆయా రచయితలు, కవులు, సృజకారులను పది కాలాల పాటు పదిలంగా నిలబడెతుంది. ఇది కదా సృజనంటే. మరి ధైర్యంగా రాశావంటారేంటి చాలా మంది. నీ ధైర్యం చాలా గొప్పదంటూ కితాబులిస్తారేంటి. ఈ మధ్య నే రాస్తున్న నా చక్రవాకం కాలమ్‌కి అభినందనలు సరే, "చాలా ధైర్యంగా రాశావు" అంటూ చాలా మంది సందేశాలు పంపుతున్నారు. నా ముప్పై ఏళ్ల సాహిత్య జీవితంలో ఇలా "ధైర్యంగా రాశావు" అని నన్నే కాదు... ఎవరినీ అన్న సందర్భాలు నాకు తెలిసి లేవు. నా జర్నలిస్టు జీవితంలో ఈ ధైర్యం అనే పదం చాలాసార్లే అనుభవంలోకి వచ్చింది. నేను విలేకరిగా ఉన్నప్పుడు రాసిన కథనాలకు నాకు తెలియకుండానే శత్రువులు పోగయ్యేవారు. నిజానికి ఏ విలేకరికైనా అలాంటి శత్రువులు వచ్చారంటే అతను తన వృత్తిలో నిలదొక్కుక్కున్నట్లేనని సీనియర్ జర్నలిస్టులు చాలా మందే నాకు చెప్పారు. పైగా జర్నలిస్టు వృత్తిలో రాణించినట్లేనని కూడా వారన్నారు. ఇదంతా జర్నలిజం వరకూ సరిపోయింది.

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

కానీ సాహిత్య సృజనలో మాత్రం ఇదిగో ఈ మధ్యనే ఈ ధైర్యం అనే పదం వినపడుతోంది. అది కూడా పదే పదే వినపడడం, నా వాట్సాప్ మెసేజ్‌లో కనిపించడం నన్ను కలవర పెడుతోంది. అక్షరానికి ప్రాణం పోయడానికి మంచి సృజన కావాలని మాత్రమే తెలుసున్న నాకు, అలా అనేక మంది మహానుభావుల రచనల్లో చదివిన నాకు ఈ ధైర్యంగా రాశావు అనే పదం ఆశ్చర్యం కలిగించడం కంటే ఎన్నడూ లేని, వస్తుందని కలలో కూడా ఊహించని నాకు భయం వేస్తోంది. అవును నాకు భయం వేస్తోంది. లేదూ భయపడాలనే ఎరుకను కలిగిస్తోంది. భయపడకుండా ఎవ్వరూ ఏదీ రాయలేని స్థితిలోకి వచ్చేశామా అనే సందేహం కూడా కలుగుతోంది. అసలు సృజనంటేనే ఎందుకో ఓ భయం నీడలా వెంటాడుతోంది. మన చుట్టూ తిరుగుతున్నట్లుగా ఓ భ్రాంతి కలుగుతోంది.

దేశం ముక్కలు అవుతుందేమోననో భయం కలిగాలి కాని, దేహం ముక్కలవుతుందని ఆందోళన చెందడమేమిటి అంటాడు దిగంబర కవి చెరబండరాజు. నేను, నువ్వు, అతను, ఆమె, ఆ పెద్దాయన, ఈ నవ యువకుడు నాలుగు అక్షరాలు రాసేందుకు ప్రసవ వేదన పడాలి కానీ, ధైర్యపు ప్రవచాల కోసం ఎదురు చూడ కూడదు కదా. ఇలా నాకే జరుగుతోందా... సృజనకారులంతా ఒక్క వాక్యం రాసేందుకు మదనపడకుండా... రాసిన తర్వాత ఏం జరుగుతుందో అని భయపడాలా. చెప్పు ఎటు నిలబడతావో చెప్పు అంటూ కవి నిలదీసినప్పుడు ధైర్యం పాదం ముందుకు నడవమంటూంటే భయం కాలు వెనకడుగు వేయమనడమేమిటి. ఇంతకు ముందు ఎప్పుడు, ఏ సృజనకు కానరాని ఈ ధైర్యం పదం కొత్తగా సాహిత్య సృజనలోకి ఎందుకు ప్రవేశిస్తోంది.

ఈ మధ్యనే తెలిసింది. తెలుగులో సృజనకారులు కాసింత భయాందోళనలతోనే రాస్తున్నారని. ఓ పద్యమో, వ్యాసమో రాసిన తర్వాత అది నచ్చిన వారు ఉంటారు, లేదూ నచ్చని వారు ఉంటారు. దాన్ని విమర్శించే వారు, వ్యతిరేకించే వారు అనేకానేక మంది ఉంటారు. నిజానికి ఉండాలి కూడా. అప్పుడే ఆ సృజనలో లోటుపాట్లు ఏమున్నాయో ఆ కవికి కాని, కవయిత్రికి కానీ తెలుస్తుంది. కాని తెలుగు సాహిత్యంలో ఆ దశ దాటిపోతోంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత వారికి నచ్చని కవో, రచయితనో ట్రోల్ చేయడం ఎక్కువైంది. ఇది ఎంత వరకూ వెళ్లిందంటే ఆ సృజనకారులు తమ ఫోన్ నంబర్లను మార్చుకునే వరకు వెళ్లింది. ఓ భయం నీడలో బతకాల్సి వస్తోంది. ఏ భాషలోనైనా సృజనకారులు ఇలా బతకడం, బతకాల్సి రావడం ఏ సమాజానికైనా వాంఛనీయం కాదు. ఏ రచనకైనా కావాల్సింది ముమ్మాటికి ధైర్యం కాదు... సృజనాత్మక శక్తి. అది ఉంటే ధైర్యం దానికదే వస్తుంది. ఆ రచనే ధైర్యాన్నిస్తుంది. వెన్నెముక మీద నిటారుగా నిలబడి రాయాలనిపిస్తుంది. సృజనకారుడి వెన్నెముక అరిగిపోవడం కంటే మృత్యువే బాగుంటుందనిపిస్తుంది.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

మళయాళం సినీ మాయాజలం

సి. శ్రీకుమరన్

మళయాళం సినీ జగత్తులో ఇటీవల నటీమణులు కొందరు నటులు, దర్శకులు తదితరులపై తమను సెక్సుపరంగా హింసిస్తున్నారని హేమ కమిటీ వెల్లడించడంతో కేరళ రాష్ట్రంలో గగ్గోలుపుట్టింది. కొందరు మళయాళ సినిమా నటీనటుల అసోసియేషన్‌కు రాజీనామా చేశారు. రోజురోజుకీ గందరగోళం ముదురుతోంది. హేమ కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందించిన అనంతరం అనేక మంది నటీమణులు తాము ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి బయటకు వచ్చి మాట్లాడారు. ఈ తరుణంలోనే ఓ నటి, ప్రముఖ నటుడు జయసూర్యతో పాటు కొల్లాం ఎమ్మెల్యే ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు.

2013లో ఓ ప్రాజెక్టు కోసం పనిచేస్తున్నప్పుడు తనను లైంగికంగా వేధింపులకు గురిచేశారని, వారి వేధింపులు తట్టుకోలేక మలయాళ చిత్ర పరిశ్రమను వదిలి చెన్నైకు వెళ్లిపోయేలా చేశారని ఆమె ఆరోపించారు. ఇంకా అనేక మంది అనేక ఆరోపణలు చేశారు. దీనితో మళయాళ సినీ పరిశ్రమను తల్లకిందులు చేస్తున్న ఈ వ్యవహారం నిగ్గు తేల్చడానికి కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం రంగంలోకి దిగింది. హేమ కమిటీ నివేదికపైన దర్యాప్తుచేసి తగు చర్యలను సిఫారసు చేసేందుకు, స్వయంగా దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీని (సిట్)ని ఏర్పాటు చేసింది. నటులు సిద్దికి, ఎడవెలబాబు మళయాళం నటీనటులు అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శులు, నటులు, మళయాళ చలనచిత్ర అకాడమీ చైర్మన్ రంజిత్, నటులు సుధీశ్, రియాజ్‌ఖాన్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. తమను సెక్సుపరంగా వేధించారని, అసభ్యంగా వ్యవహరించారని ఇద్దరు నటీమణులు ఫిర్యాదుచేశారు. తిరువనంతపురంలోని ఒక హోటల్‌లో సెక్సువల్‌గా దాడిచేశారని ఒక యువ నటి ఫిర్యాదుచేశాక సిద్దికి అసోసియేషన్‌కు రాజీనామా చేశారు. బెంగాలీ నటీమణి తనతో అనౌచిత్యంగా వ్యవహరించినట్లు ఫిర్యాదు చేయడంతో రంజిత్ అసోషియేషన్ నుంచి వైదొలిగారు.

మళయాళ సినీ పరిశ్రమను తల్లకిందులు చేస్తున్న ఈ వ్యవహారం నిగ్గు తేల్చడానికి కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం రంగంలోకి దిగింది. హేమ కమిటీ నివేదికపైన దర్యాప్తుచేసి తగు చర్యలను సిఫారసు చేసేందుకు, స్వయంగా దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీని (సిట్)ని ఏర్పాటు చేసింది. నటులు సిద్దికి, ఎడవెలబాబు మళయాళం నటీనటులు అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శులు, నటులు, మళయాళ చలనచిత్ర అకాడమీ చైర్మన్ రంజిత్, నటులు సుధీశ్, రియాజ్‌ఖాన్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. తమను సెక్సుపరంగా వేధించారని, అసభ్యంగా వ్యవహరించారని ఇద్దరు నటీమణులు ఫిర్యాదుచేశారు.

నటులు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) ఆధారంగా కేసు వేయాలని ప్రయత్నిస్తున్నారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్) చట్టంకింద విచారణ జరుగుతుంది. భారత ఎవిడెన్స్ చట్టం స్థానే భారతీయ సాక్ష్య అధిఅయం (బిఎస్‌ఏ) చట్టం కూడా వర్తింపచేస్తారు. తొమ్మిదిమంది నటులు తదితర స్థానాల్లో ఉన్నవారిపై క్రిమినల్ కేసులుపెట్టారు. వారిలో కేరళ చలనచిత్ర అకాడమి మాజీ చైర్మన్ నటుడు ముఖేష్, మళయాళం సినీనటుల అసోసియేషన్ (ఏఎమ్ఎమ్ఏ) మాజీ ప్రధాన కార్యదర్శులు సిద్ధిఖి, ఎడవెలబాబు నటులు జయసూర్య మణియన్ పిళ్లరాజు, ప్రొడక్షన్ కంట్రోలర్ నోబ్లి, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ విక్కు, రాష్ట్ర కాంగ్రెస్ న్యాయవాదుల కమిటీ అధ్యక్షుడు వివిఎస్ చంద్రశేఖరన్ ఉన్నారు. ఈ లోపు జరిగిన కొత్త పరిణామంతో ఏఎమ్ఎమ్ఏ ఎగ్జిక్యూటివ్‌ను తొలగించారు. అతనిపై కూడా సెక్సువల్‌గా అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో ఉన్న 17మంది సభ్యులు, అధ్యక్షుడు కూడా రాజీనామా చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా తమ తమ పోస్టులకు తక్షణం రాజీనామా చేయాలని ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ మరికొందరు డిమాండ్ చేశారు. ఇవి చెదురుమదురుగా జరిగిన సంఘటనలు కావని, తీవ్రంగా పరిగణించ వలసిఉంటుందని వీరు వ్యాఖ్యానించారు. ఎంఎల్ఏ ఎం ముఖేష్‌ను రాజీనామా చేయాలని సీపీఐ, కాంగ్రెస్, బీజేపి వత్తిడిచేశాయి. ముఖేష్ కొల్లంనుంచి రెండుసార్లు ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. ఆయనపైన కూడా సెక్సుపరమైన వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ముఖేష్‌పైన సెక్షన్ 376(రేప్ కేసు) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇది బెయిల్ ఇవ్వడానికి వీలులేని సెక్షన్. అయితే తనపైన వచ్చిన ఆరోపణలను ఆయన తిరస్కరించారు. రాజీనామా చేయడానికి ససేమిరా అన్నారు.



హేమ కమిటీ నివేదికను బహిర్గతం చేసినట్లయితే బాగుండేదని ప్రముఖులు, ప్రజలు భావిస్తున్నారు. తీవ్రమైన ఆరోపణలు వచ్చినందున సిట్ ఏర్పాటు తగిందని ప్రభుత్వం భావించి అనేక ప్రముఖ పోలీసు అధికారులతో సిట్ ఏర్పాటు చేసింది. తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చిన వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నాయని తెలుస్తోంది. హేమ కమిటీ నివేదిక రాష్ట్రంలో మళయాళం చలనచిత్ర పరిశ్రమను వణికిస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ దర్యాప్తు చిత్రపరిశ్రమను ప్రక్షాళన చేయగలదన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నటీనటులు పనిచేసేచోట సురక్షిత పరిస్థితులు ఉండాలని, గౌరవంగా మహిళా నటులను చూడాలని ప్రజలు కోరుతున్నారు. హేమ కమిటీ నివేదిక పరిశ్రమను ప్రక్షాళన చేసేందుకు ప్రారంభం మాత్రమే అవుతుందని భావిస్తున్నారు. ప్రక్షాళన జరిగితే మహిళలు పనిచేసే చోట సురక్షిత వాతావరణం, గౌరవంగా పనిచేయించుకోవడం ఉండాలని సినీ పరిశ్రమ ఆశిస్తోంది. హేమ కమిటీ ఇలాంటి సిఫారసులు చేసి ఉన్నట్లయితే ఈ కమిటీకి మంచిపేరు వస్తుంది.

మంత్రిగా రామదాస్ సోరేన్ ప్రమాణం

రాంచీ: జార్ఖండ్‌లో హేమంత్ సోరేన్ కేబినెట్‌లో మంత్రిగా రామదాస్ సోరేన్ శుక్రవారం ప్రమణ స్వీకారం చేశారు. రాజధాని రాంచీలోని రాజ్‌భవన్‌లో రామదాస్ చేత ఆ రాష్ట్ర గవర్నర్ సంతోశ్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. సీఎం హేమంత్ సోరెన్‌తోపాటు కేబినెట్ మంత్రులు హాజరయ్యారు. సోరేన్ కేబినెట్‌లోని మంత్రి చంపయి సోరేన్ జార్ఖండ్ ముక్తి మోర్చ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో ఆయన స్థానంలో రామదాస్ సోరెన్‌ను తీసుకున్నారు. సింగ్‌భమ్ జిల్లాలోని ఘట్‌శిల అసెంబ్లీ నియోజక వర్గం నుంచి రామదాస్ ఎన్నిక య్యారు. 2009, 2019లో ఆయన జేఎంఎం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం జంషెడ్‌పూర్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. మరోవైపు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి. బీజేపీతో కలిసి ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) పోటీ చేయనుంది. ఇండియా కూటమిలోని జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి.

మా ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

బీజేపీ, జేడీ(ఎస్)పై మండిపడిన సిద్ధరామయ్య

హుబ్లీ : ముడా కుంభకోణానికి సంబంధించి తాను రాజీనామా చేయడానికి తప్పేమీ చేయలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్ష బీజేపీ, దాని కూటమి భాగస్వామి జేడీ(ఎస్) ప్రయత్నిస్తున్నాయని శుక్రవారం ఆయన ఆరోపించారు. తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీజేపీ ఇప్పటికీ 'ఆపరేషన్ కమలం'ను ప్రయత్నిస్తోందని, అయితే వారు ఆ ప్రయత్నాలలో విజయం సాధించలేరని తెలిపారు. 'నా రాజీనామా ఎందుకు అడుగుతున్నారు. వారు అడిగిన వెంటనే ఇవ్వగలరా?... విజయేంద్ర (బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు) రాజీనామా అడిగినందున ఇవ్వగలరా?... అప్పుడు నేను విజయేంద్రను తన పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయమని అడుగుతాను. అతను ఒప్పుకుంటాడా?' అని ముడా కుంభకోణంపై తాను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానమిచ్చారు. ఇక్కడ విలేకరులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ 'రేపు (కోర్టులో) వాదన కొనసాగుతుంది. హైకోర్టు ఏం తీర్పు ఇస్తుందో చూద్దాం. నేనేమీ తప్పు చేయలేదు' అని తనపై విచారణకు గవర్నర్ అనుమతించడాన్ని సవాలు చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. జేడీ(ఎస్) నేత, కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి, బీజేపీ మాజీ మంత్రులు శశికళ జోలె, మురుగేష్ నిరాణి, జి.జనార్ధన రెడ్డిపై విచారణకు అనుమతి కోరుతూ పెండింగ్‌లో ఉన్న అభ్యర్ధనలపై చర్య తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులందరూ శనివారం గవర్నర్‌ను కలుస్తారని సిద్ధరామయ్య తెలిపారు. 'అవి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. మేము వారిపై విచారణపై చర్యలను కోరతాం. ఎందుకంటే ఆ కేసులన్నింటిలో విచారణ ముగిసింది. ఛార్జ్‌షీట్ దాఖలు పెండింగ్‌లో ఉంది. నా కేసు దర్యాప్తు ఇంకా జరగలేదు. నివేదిక లేదు' అని అన్నారు. 'ఆపరేషన్ కమల'లో భాగంగా రూ.100 కోట్లు ఇస్తానని బీజేపీ... కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందని మాండ్య కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్‌గౌడ్ (రవి గణిగ) చేసిన మరో ప్రశ్నకు సీఎం సమాధానమిస్తూ, 'అది నిజమేనని అతను మాకు చెప్పాడు' అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఎన్నడూ అధికారంలోకి రాలేదని, 2008లో అయినా, 2019లో అయినా ఆపరేషన్ కమలంపైనే వారు ఎప్పుడూ ఆధారపడ్డారని తెలిపారు. 'వారు మెజారిటీతో సొంతంగా ఎప్పుడు అధికారంలోకి వచ్చారు? ఎప్పుడూ వెనుక ద్వారం నుంచే అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు కూడా వారు ప్రయత్నిస్తున్నారు. కానీ మేము (కాంగ్రెస్) 136 (ఎమ్మెల్యేలు) ఉన్నాము. ఇది అంత సులభం కాదు. ఎందుకంటే వారు దాదాపు 60 మంది ఎమ్మెల్యేల రాజీనామాను (విజయవంతం చేయవలసి ఉంటుంది) నిర్ధారించుకోవాలి. మా ఎమ్మెల్యేలు ఎవరూ డబ్బు కోరికకు లొంగరు' అని సీఎం సిద్ధరామయ్య చెప్పారు.

అమిత్ షాతో బెంగాల్ గవర్నర్ భేటీ

వైద్యురాలి హత్యానంతర పరిణామాలపై నివేదిక

న్యూఢిల్లీ: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్ శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. కోల్‌కతాలో చోటు చేసుకున్న తాజా పరిస్థితులపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తుంది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి పోస్ట్ గ్రాడ్యుయేషన్ జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన నాటి నుంచి మొన్నటి బీజేపీ అధ్వర్యంలో జరిగిన బంద్ వరకు వరుస పరిణామాలపై అమిత్ షాకు గవర్నర్ బోస్ నివేదిక అందజేసినట్లు సమాచారం. గత వారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్‌తో బోస్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో విధులకు ట్రెయినీ వైద్యురాలు హాజరయింది. తొమ్మిదో తేదీ తెల్లవారుజామున విశాంత్రి తీసుకునేందుకు సెమినార్ హాల్‌లోకి వెళ్లింది. ఆ రోజు ఉదయం అర్ధనగ్నంగా ఆమె మృతదేహం పడి ఉండడాన్ని ఆసుపత్రి సిబ్బంది గుర్తించారు. వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వంపై నిరసనలు అయితే వెల్లువెత్తాయి. మరోవైపు ఈ కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తూ కోల్‌కతా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఛలో సెక్రటేరియట్‌కు విద్యార్థి సంఘులు పిలుపు నిచ్చాయి. ర్యాలీలోపాల్గొన్న వారిపై పోలీసులు వ్యవహరించిన వైఖరికి నిరసనగా బీజేపీ 12 గంటల పశ్చిమ బెంగాల్ బంద్‌కు పిలుపు నిచ్చింది.

బెంగాల్‌పై మాట్లాడే అర్హాత మీకెక్కడిది?

మణిపూర్ సీఎంపై మండిపడిన టీఎంసీ నేత ఘోష్

న్యూఢిల్లీ : కోల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యవహరించిన తీరుపై మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు సాగరిక ఘోష్ మండిపడ్డారు. మణిపూర్‌లోని పరిస్థితుల దృష్ట్యా పశ్చిమ బెంగాల్‌పై వ్యాఖ్యానించే 'నైతిక అధికారం' ఆయనకు లేదని ఘోష్ అన్నారు. 'మణిపూర్ ముఖ్యమంత్రిలా కాకుండా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నిటికీ మించి హత్యాచార బాధితురాలికి 'న్యాయం' చేస్తూనే ఉన్నారు' అని ఘోష్ పీటీఐకి చెప్పారు. 'కోల్‌కతా పోలీసులు ఈ కేసును 24 గంటల్లో ఛేదించారు. అయితే మణిపూర్‌లో 18 నెలల తర్వాత కూడా వేలాది మంది సహాయక శిబిరాల్లో బాధపడుతున్నారు. జాతి హింసలో 220 మందికి పైగా మరణించారు. పోలీసులు నెలల తరబడి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు' అని ఆమె విమర్శించారు. గత 18 నెలలుగా తన ప్రజలకు ఆశలు కల్పించడంలో పూర్తిగా విఫలమైన మణిపూర్ సీఎంకు బెంగాల్‌పై మాట్లాడే నైతిక హక్కు, నైతిక అధికారం లేదన్నారు.

ఫిన్‌టెక్ రంగం ప్రోత్సాహానికి చర్యలు

ప్రధాని మోదీ

ముంబై : ఫిన్‌టెక్ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన విధానపరమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం తెలిపారు. ఏంజెల్ టాక్స్‌ను తొలగించడం, దేశంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రూ.1 లక్ష కోట్లు కేటాయించడం, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయడం వంటి ఉదాహరణలను వివరించారు. ఫలితంగా గత పదేళ్లలో ఈ రంగం 31 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024' కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంచటంతో పాటు సైబర్ నేరాలను అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నియంత్రణ సంస్థలను కోరారు. ప్రజలకు ఆర్థిక సేవలను చేరువ చేయటంలో ఫిన్‌టెక్ రంగం కీలకపాత్ర పోషించిందని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో ఇవి ముఖ్య భూమిక పోషిస్తున్నాయని అన్నారు. భారతీయులు ఫిన్‌టెక్‌ను అలవర్చుకున్న తీరు అసామాన్యమని, ఇంత వేగంగా ప్రపంచంలో ఈ రంగం ఎక్కడా విస్తరించలేదని మోదీ చెప్పారు. ఫిన్‌టెక్ ప్రభావం కేవలం సాంకేతికకు మాత్రమే పరిమితం కాలేదని... సామాజికంగానూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రపంచానికి సమాంతర ఆర్థిక వ్యవస్థ వల్ల కలిగే ప్రమాదాల గురించి కూడా ప్రధాన మంత్రి తన ప్రసంగంలో హెచ్చరించారు. ఆర్థిక సేవల విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మధ్యనున్న అంతరాన్ని తగ్గించిందని వివరించారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన కింద ఇప్పటివరకు రూ.27 లక్షల కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. దేశం కూడా పండుగ వాతావరణంలో ఉన్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థ, క్యాపిటల్ మార్కెట్ సంబరాలు జరుపుకుంటున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో అందరినీ భాగస్వాములను చేయడంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ఈరోజు అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు. విధానపరమైన నిర్ణయాలతో పాటు సాంకేతికంగా వచ్చిన పురోగతే అందుకు దోహదం చేసిందని వివరించారు. భారత ఫిన్‌టెక్ ప్రయాణంలో విధాన రూపకర్తలు, నియంత్రణ సంస్థలు, ఆవిష్కర్తల మధ్య సహకారం చాలా కీలకమైనదని తెలిపారు. వినూత్న వ్యాపారాలు ఒక క్రమపద్ధతిలో వృద్ధి చెందడానికి రిజర్వ్ బ్యాంక్ విధానాలు దోహదం చేశాయని దాస్ అన్నారు. కొత్త ఆవిష్కరణలను ఆహ్వానించడం, ప్రోత్సహించడానికి తామెప్పుడూ సిద్ధంగా ఉంటామనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

ఫిన్‌టెక్ రంగంలోని వ్యక్తులతో గత ఏడాదిగా అనేక సంప్రదింపులు జరిపామని వెల్లడించారు. కలసికట్టుగా ముందుకువెళ్లడానికి తాము చేస్తున్న కృషికి ఇది ఒక ఉదాహరణ అని వివరించారు. భారతదేశం, ఇతర దేశాల నుంచి విధాన నిర్ణేతలు. నియంత్రణదారులు, సీనియర్ బ్యాంకర్లు, పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలతో సహా దాదాపు 800 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

ఎమ్మెల్యే ఫామ్ హౌస్‌లో రైఫిళ్ల చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

ఇంఫాల్: బీజేపీ మణిపూర్ ఎమ్మెల్యే ఫామ్ హౌస్‌లో రైఫిళ్ల చోరీ కేసుకు సంబంధించి ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్ది రోజుల క్రితం సెక్‌మైలీకింతబీలోని బీజేపీ ఎమ్మెల్యే జాయ్ కిషన్ సింగ్ ఫామ్‌హౌస్‌లో మూడు రైఫిళ్లను దుండగులు దొంగిలించారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించారు. అందులోభాగంగా ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా... వారిలో నలుగురు పోలీసులు ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా.. 10 రోజుల పోలీసుల కస్టడీ విధించింది. ఫామ్ హౌస్ కాపలాగా ఉన్న గ్రామ రక్షక దళాన్ని బెదిరించి... వీరు ఈ చోరీకి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. తంగ్‌మీబాండ్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా జాయ్ కిషన్ సింగ్ విజయం సాధించారు. పశ్చిమ ఇంఫాల్, తూర్పు ఇంపాల్‌లో మెయితీ తెగల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. అలాగే గతేడాది మెయితీ, కూకీ తెగల మధ్య ఘర్షణల్లో భాగంగా ఈ తరహా ఆయుధాల చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి.

'దివ్యాంగురాలి కేటగిరి'లో రాసిన పరీక్షలనే పరిగణించాలి

పూజా ఖేద్కర్

న్యూఢిల్లీ: తాను రాసిన 12 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో కేవలం 'దివ్యాంగురాలి' కేటగిరిలో రాసిన పరీక్షలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును కోరారు. తనపై అనర్హత వేటు విషయంలో ఆమె కోర్టులో వాదనలు వినిపించారు. ఏసీఎల్ గాయం కారణంగా ఎడమ మోకాలు అస్థిరంగా ఉన్నట్లు మహారాష్ట్ర ఆసుపత్రి ఇచ్చిన ధృవీకరణ ఉందని ఆమె కోర్టుకు వెల్లడించారు. తనకు 47 శాతం వైకల్యం ఉందని... ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 శాతం దాటితే దివ్యాంగులుగా గుర్తిస్తారని వెల్లడించింది. యూపీఎస్‌సీకి తనపై అనర్హత వేటు వేసే అధికారం లేదని పేర్కొన్నారు. తాను జనరల్ కేటగిరి అభ్యర్థినిగా రాసిన ఏడు పరీక్షలను పరిగణనలోకి తీసుకోకూడదని తాజాగా శుక్రవారం ఉదయం పూజా న్యాయస్థానంలో దాఖలు చేసిన ప్రమాణపత్రంలో పేర్కొన్నారు. తన పేరులో మార్పులు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 12 సార్లు సివిల్స్ పరీక్షలకు హాజరైనట్లు వచ్చిన ఆరోపణలను ఆమె అంగీకరించడం లేదు. తన పేరు మధ్యలో మాత్రమే చిన్న మార్పు చేశానని వాదిస్తున్నారు. యూపీఎస్సీ బయోమెట్రిక్ వ్యవస్థ డేటా కూడా తన గుర్తింపును పరీక్షించిందని పేర్కొంది. అవి నా పత్రాలు తప్పుడువని పేర్కొనలేదని గుర్తు చేశారు. ఇప్పటికే తాను ప్రొబేషనరీ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. తనపై కేవలం కేంద్రప్రభుత్వం, ముఖ్యంగా డీపీటీ విభాగం మాత్రమే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి తగ్గనున్న గ్యాస్ సిలిండర్ ధర?

న్యూఢిల్లీ: సెప్టెంబరు 1వ తేదీ నుంచి గ్యాస్ సిలిండర్ ధరలతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి గృహావసరాలకు వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 వరకు, వాణిజ్య సిలిండర్ ధర రూ.60 నుంచి రూ.70 వరకు తగ్గనున్నట్లు సమాచారం. ఆగస్టులో బిజినెస్-గ్రేడ్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధర రూ.8.50 పెరిగింది, జులైలో రూ.30 తగ్గింది. గతేడాది రాఖీ, ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గృహావసరాల వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.300 తగ్గించింది. ఇప్పుడు దాని ధర మరో రూ.50 తగ్గితే.. రూ.760కే అందుబాటులోకి వస్తుంది. పీఎం ఉజ్వల యోజన కింద రాయితీ పొందేవారు రూ.460కే సిలిండర్‌ని ఇంటికి తీసుకెళ్లవచ్చు. కాగా గ్యాస్ సిలిండర్ రేట్లతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గనున్నట్లు సమాచారం. పెట్రోల్ లీటర్‌పై రూ.6, డీజిల్ లీటర్‌పై రూ.5 వరకు తగ్గనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్ ధర లీటర్ రూ.100 దాటగా.. డీజిల్ ధర రూ.90 దాటింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు రేట్లు తక్కువగా ఉండటంవల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మేఘాలయ అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా టీఎంసీ

షిల్లాంగ్: మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మేఘాలయ అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు పొందింది. ఆ పార్టీ నేత, మాజీ సీఎం ముకుల్ సంగ్మా ప్రతిపక్ష నాయకుడిగా (ఎల్‌ఓపీ) నియమితులయ్యారు. టీఎంసీ ఎమ్మెల్యే ముకుల్ సంగ్మాను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించినట్లు మేఘాలయ అసెంబ్లీ కమిషనర్, కార్యదర్శి ఆండ్రూ సైమన్స్ ఒక నోటిఫికేషన్‌లో తెలిపారు. మేఘాలయ అసెంబ్లీలో 'ప్రతిపక్ష చీఫ్ విప్'గా రోనీ వీ లింగ్డోను స్పీకర్ గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో వరుసగా మూడుసార్లు అధికారంలో ఉన్న సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల్లో తొలిసారి మేఘాలయ అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు పొందింది. 60 మంది సభ్యులున్న మేఘాలయ అసెంబ్లీలో టీఎంసీకి ఐదుగురు ఎమ్మెల్యేలున్నారు. మరోవైపు ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ముగ్గురు సభ్యులు అధికార ఎన్‌పీపీలో చేరారు. మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో మేఘాలయ అసెంబ్లీలో మిగిలి ఉన్న ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యే రోనీ వీ లింగ్డో టీఎంసీకి మద్దతిచ్చారు. దీంతో అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ హోదా తమకు ఇవ్వాలని స్పీకర్ థామస్ ఏ సంగ్మాను టీఎంసీ కోరడంతో ఆయన దీనికి అంగీకరించారు.

వైద్యురాలి తల్లిదండ్రులకు అర గంటలోనే మూడు ఫోన్ కాల్స్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కర్ మెడికాల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలి హత్యాచారంపై దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇంకా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆమె మృతికి సంబంధించి పలు భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ కుమార్తె మృతిపై ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరుపై మృతిరాలి తల్లిదండ్రులు పలు సందేహాలు వ్యక్తం చేశారు. ఈ నెల తొమ్మిదోతేదీ ఉదయం కేవలం అరగంట వ్యవధిలో ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి నుంచి తమకు మూడు ఫోన్ కాల్స్ వచ్చాయని తెలిపారు. మొదటి ఫోన్ కాల్‌లో తమ కుమార్తె ఆరోగ్య పరిస్థితి బాగోలేదని... వెంటనే ఆసుపత్రికి రావాలని చెప్పారన్నారు. తమ కుమార్తెకు ఏమైందంటూ ఆందోళనగా కోరగా... తాను వైద్యురాలిని కాదని... అసిస్టెంట్ సూపరింటెండెంటంటూ అవతలి వ్యక్తి స్పష్టం చేశారన్నారు. ఆ వెంటనే మరో ఫోన్ కాల్ వచ్చిందని... తమ కుమార్తె అరోగ్యం ఎలా ఉందని ప్రశ్నించే లోపే... ముందు ఆసుపత్రిలోని ఛాతీ విభాగానికి రావాలని ఫోన్ చేసిన వారు సూచించారన్నారు. ఆ కొద్ది సేపటికే మరో ఫోన్ కాల్ వచ్చిందని... తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుని మృతి చెందిందని చెప్పారంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనకు ముందు రోజు అంటే ఎనిమిదో తేదీ రాత్రి 11.30 గంటలకు తమ కుమార్తెతో తాను మాట్లాడానని గుర్తు చేసుకున్నారు. ఆ మరునాడే తన కుమార్తె మరణ వార్త వినాల్సి వచ్చిందన్నారు. వైద్యురాలిపై హత్యాచారం అనంతరం తమ పట్ల ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. తమ కుమార్తె మృతి చెందిన వెంటనే తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే తమ కుమార్తె మృతదేహాన్ని వెంటనే తాము చూసే అవకాశం కూడా కల్పించలేదన్నారు. స్థానిక కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఈ కేసుపై స్పందించాయి. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించాయి. ఇక వైద్యురాలి హత్యాచారం కేసు దర్యాప్తు సీబీఐ చేపట్టిన విషయం విధితమే.

నమాజ్‌కు నో బ్రేక్

గువహాతి: ముస్లింలపై అసోం ప్రభుత్వ అక్కసు మరోమారు బహిర్గతమైంది. దశాబ్దాలుగా ఉన్న సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ శుక్రవారం రోజున ముస్లిం ఎమ్మెల్యేలకు ఇచ్చే నమాజ్ విరామాన్ని రద్దు చేసింది. నమాజ్ కోసం ఇచ్చే రెండు గంటలు విరామాన్ని రద్దు చేస్తూ శాసనసభ నియమాల కమిటీ తీర్మానించింది. ఇతర రోజుల మాదిరిగానే శుక్రవారం కూడా సభ కార్యకలాపాలను యథావిధిగా సాగించాలని పేర్కొంది. రాజ్యాంగంలోని లౌకిక స్వభావం దృష్ట్యా శుక్రవారాల్లో ఏ విధమైన వాయిదా లేకుండా అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించాలని స్పీకర్ విశ్వజిత్ ప్రతిపాదించినట్లు తాజా ఉత్తర్వులు పేర్కొన్నాయి. దీనిని ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ స్వాగతించారు. నమాజ్ విరామాన్ని తొలగించడంతో అసెంబ్లీ ఉత్పాదకతకు ప్రాధాన్యత లభిస్తుందన్నారు. కాగా, 1937లో ముస్లిం లీగ్‌కు చెందిన సయ్యద్ సాదుల్లా ఈ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ముస్లింలే లక్ష్యంగా చౌకబారు ప్రచారం: తేజస్వి: పాట్నా: అసోంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలను సాఫ్ట్ టార్గెట్‌గా చేసుకుందని, నమాజ్ విరామాన్ని రద్దు చేసి చౌకబారు ప్రచారం చేసుకుంటోందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. ముస్లింలను సాఫ్ట్‌గా టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. బీహార్ రాజధాని పాట్నాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిమంత బిస్వా శర్మ చౌకబారు ప్రచారానికి యత్నిస్తున్నారన్నారు. 'ఆయన కేవలం చౌకబారు ప్రచారాన్ని కోరుకుంటున్నారు. ముస్లింలను సాఫ్ట్ టార్గెట్‌గా బీజేపీ మార్చుకుంది' అని మండిపడ్డారు.

పిల్లలు లేని ఆమెకు... మా బాధ ఎలా తెలుస్తుంది

మమతపై హతురాలి తల్లి మండిపాటు

కోల్‌కతా: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనపై మండిపడుతూ వైద్య విద్యార్థులు చేస్తున్న నిరసనలపై సీఎం మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండు రోజుల క్రితం జరిగిన ర్యాలీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ... జూనియర్ డాక్టర్లు తమ ఆందోళన విరమించి వెంటనే విధుల్లోకి హాజరు కావాలని కోరారు. సమ్మె చేస్తున్న డాక్టర్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిపై కేసులు నమోదు చేయడం తనకు ఇష్టం లేదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలను బెదిరింపుగా భావించిన డాక్టర్లు విధుల్లోకి చేరడానికి నిరాకరించారు. అయితే దీదీ వ్యాఖ్యలపై బాధితురాలు అభయ తల్లి మండిపడ్డారు. 'ఆడబిడ్డను కోల్పోయిన మా కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని నేను నిరసనకారులు విన్నవిస్తున్నా. మాకు న్యాయం అక్కర్లేదని ముఖ్యమంత్రి అంటున్నారు. మమతకు పిల్లలెవరూ లేరు. ఒక తల్లి తన బిడ్డను కోల్పోతే ఉండే బాధ ఆమెకు అర్థం కాదు. అర్థం చేసుకోలేరు కూడా. మమత వ్యాఖ్యలతో మా కుటుంబ సభ్యులు చాలా బాధపడ్డారు' అని అభయ తల్లి భావోద్వేగానికి గురయ్యారు.

తమిళనాడుకు భారీగా పెట్టుబడులు: సీఎం స్టాలిన్

చెన్నై: రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చలు జరుపుతున్నారు. తొలి రోజు పర్యటనలో చెన్నై, కోయంబత్తూర్, మధురై, చెంగల్పట్టులో వివిధ ప్రాజెక్టుల కోసం రూ.900 కోట్ల పైగా పెట్టుబడుల హామీలు వచ్చాయని వీటి ద్వారా వివిధ రంగాల్లో 4100 నూతన ఉద్యోగాలు సమకూరతాయని 'ఎక్స్' పోస్ట్‌లో స్టాలిన్ వివరించారు. నోకియా రూ. 450 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించిందని, దీంతో 100 ఉద్యోగాలు, పేపాల్‌లో 1000 ఉద్యోగాలు, ఈల్డ్ ఇంజనీరింగ్ సిస్టమ్స్ ద్వారా రూ. 150 కోట్ల పెట్టుబడులతో 300 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇక మైక్రోచిప్ రూ. 250 కోట్ల పెట్టుబడులు పెట్టనుందని 1500 ఉద్యోగాలు రానున్నాయని పేర్కొన్నారు. ఇన్ఫినిక్స్ పెట్టుబడులతో 700 ఉద్యోగాలు, అప్లైడ్ మెటీరియల్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా 500 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రెండు వారాల పర్యటనలో పెద్దసంఖ్యలో వివిధ కంపెనీలు భారీ పెట్టుబడులతో తమిళనాడుకు తరలివస్తాయని స్టాలిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాన్‌ఫ్రాన్సిస్కో ఇన్వెస్ట్‌మెంట్ కాంక్లేవ్‌లో స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడును ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదిగేలా చర్యలు చేపడతామని చెప్పారు.

కారు కంపెనీపై రూ.50 కోట్లకు నష్టపరిహారం కేసు

ముంబై : జాగ్వార్ ల్యాండ్ రోవర్ కంపెనీపై బాలీవుడ్ నటి రిమి సేన్ నష్టపరిహారం కేసు దాఖలు చేశారు. 2020లో రిమిసేన్.. ల్యాండ్ రోవర్ కారును రూ.92 లక్షలకు కొనుగోలు చేశారు. కానీ ఆ కారుకు చేయిస్తున్న రిపేర్లతో తనకు మానసిక ఒత్తిడి కలుగుతున్నట్లు ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఆథరైజ్డ్ డీలర్ సతీశ్ మోటార్స్ సంస్థ నుంచి తన కారును ఆమె కొనుగోలు చేశారు. 2023 జనవరి వరకు దానికి వారెంటీ ఉంది. అయితే కోవిడ్, లాక్‌డౌన్ వల్ల ఆ సమయంలో కారు ఎక్కువగా షెడ్డుకే పరిమితమైంది.కానీ ఆ తర్వాత ఆమె కారును ఎక్కువగా వినియోగించారు. అతిగా వాడడం వల్ల ఆ కారులో ఉన్న లోపాలు బయటకు వచ్చాయి. సన్‌రూఫ్, సౌండ్ సిస్టమ్, రియర్ ఎండ్ కెమెరాల్లో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. రియర్ ఎండ్ కెమెరాలో లోపం వల్ల.. తన కారు పిల్లర్‌కు ఢీకొన్నట్లు ఆమె చెప్పారు.

శివాజీ విగ్రహం నిర్మాణ సలహాదారు చేతన్ పాటిల్ అరెస్ట్

ముంబై: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో 35 అడుగుల ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనలో నిర్మాణ సలహాదారుడు చేతన్ పాటిల్‌ను శుక్రవారం ఉదయం కోల్హపూర్‌లోని అతడి నివాసంలో అరెస్ట్ చేశారు. శివాజీ విగ్రహం కూలిన ఘటన మహారాష్ట్రలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తుంది. ఈ నేపథ్యంలో ఏకనాథ్ శిండే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా విగ్రహ నిర్మాణ సలహాదారుడిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసింది. తాను శివాజీ విగ్రహానికి నిర్మాణ సలహాదారుడిగా వ్యవహరించలేదని ఈ సందర్భంగా చేతన్ స్పష్టం చేస్తున్నారు. కేవలం ఈ విగ్రహానికి బేస్‌మెంట్ మాత్రం తాము నిర్మించామన్నారు.

పాకిస్థాన్‌తో చర్చల కాలం ముగిసింది: జైశంకర్

న్యూఢిల్లీ: సాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశానికి హాజరుకావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఇస్లామాబాద్ ఆహ్వానించిన నేపథ్యంలో కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో నిరంతర చర్చలు జరిపే కాలం ముగిసిందన్నారు. పాక్ ఎలా వ్యవహరిస్తే అందుకు తగిన విధంగా భారత్ సైతం బదులు ఇస్తుందని చెప్పారు. దిల్లీలో శుక్రవారం జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడుతూ, జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 అధికరణ రద్దు ఒక ముగిసిన కథ అని అన్నారు. పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, మాల్దీవులతో మారుతున్న సంబంధాలపై మాట్లాడుతూ, ప్రపంచంలోని ఏ దేశాన్ని చూసినా పొరుగుదేశాలతో చిక్కుముడులు కనిపిస్తాయని, పొరుగుదేశాలతో సమస్యలు లేని దేశమంటూ ఏదీ కనిపించదని అన్నారు. ఇది పొరుగుదేశాల సహజ స్వభావమని అన్నారు. పరస్పర సహాయ, సహకారాలు అందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారుతో ప్రధాన మంత్రి మోదీ ఇటీవల మాట్లాడారని, అక్కడి హిందువులు, మైనారిటీలకు భద్రతకు యూనస్ హామీ ఇచ్చారని జైశంకర్ చెప్పారు. మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ మయిజ్జు తో సంబంధాల గురించి మాట్లాడుతూ, వారి విధానంలో నిలకడ లేకపోవడం, ఒడిదుడుకులు వంటివి ఉన్నా ఆ దేశంతో ఇండియా లోతైన సంబంధాలు కొనసాగిస్తుందన్నారు.

నైట్ డ్యూటీ... భయం భయం

- తీవ్రంగా ఆందోళన చెందుతున్న మహిళా వైద్యులు
- ఇక ఆయుధాలు వెంట తీసుకువెళ్లాల్సిందేనని అభిప్రాయం
- ఐఎంఏ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: కోల్‌కతా వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రోజురోజుకీ మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతుండటంపై తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వచ్చాయి. విధుల్లో ఉన్న సమయంలోనే మహిళా వైద్యురాలిపై అత్యంత పాశవిక దాడి జరగడం అటు వైద్యుల్లోనూ తీవ్ర అలజడి రేపింది. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించేందుకు కొందరు వైద్యులు భయపడుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడయింది. ముఖ్యంగా మహిళా వైద్యులు ఇందుకు వెనకడుగు వేస్తున్నారని, ఆత్మరక్షణ కోసం విధులకు వచ్చేటప్పుడు ఆయుధాలను వెంట తెచ్చుకోవాలని భావిస్తున్నట్లు మరికొందరు మహిళా వైద్యులు చెప్పారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ఇటీవల చోటుచేసుకున్న వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో వైద్యుల భద్రతకు సంబంధించిన సమస్యలను అంచనా వేసేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఇటీవల ఒక ఆన్ లైన్ సర్వే నిర్వహించింది. ఇందులో 22 రాష్ట్రాలకు చెందిన 3,885 మంది ప్రభుత్వ/ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు. వీరిలో 85 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. 61 శాతం మంది ఇంటర్న్‌లు లేదా పీజీ వైద్యవిద్యార్థులే. సర్వేలో వారు వెల్లడించిన విషయాలను పరిశీలిస్తే... సర్వేలో పాల్గొన్న వైద్యుల్లో 24.1 శాతం మంది నైట్ డ్యూటీలో సురక్షితంగా భావించడం లేదని, మరో 11.4 శాతం మంది అత్యంత ఆందోళన వ్యక్తం చేసినట్లు తేలింది. ఇలా భయపడుతోన్న వారిలో అత్యధికులు మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులే ఉన్నారు. నైట్ షిఫ్టుల్లో డ్యూటీ రూమ్ లేదని సర్వేలో పాల్గొన్న 45 శాతం మంది పేర్కొన్నారు. డ్యూటీ రూమ్‌లు ఉన్నవారు మాత్రం అత్యంత సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. డ్యూటీ రూమ్‌లు ఉన్నచోట అవి సరిపోవడం లేదని, గోప్యత లేకపోవడం, తాళాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంచుకోవాల్సి వస్తుందని చాలామంది అభిప్రాయం. అందుబాటులో ఉన్న మూడింట ఒకవంతు డ్యూటీ రూమ్‌లలో అటాచ్‌డ్ బాత్‌రూమ్‌లు లేవని తేలింది. వాటికోసం చాలాదూరం వెళ్లాల్సి వస్తోందని తెలిసింది. సగానికి పైగా (53 శాతం) డ్యూటీ రూమ్‌లు... వార్డులు/అత్యవసర చికిత్సా విభాగాలకు చాలా దూరంలో ఉన్నాయని అధ్యయనంలో వెల్లడయింది. మొత్తంగా సర్వేలో పాల్గొన్న అనేకమంది రాత్రి షిఫ్టుల్లో సురక్షితంగా లేమని భావిస్తున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో అనేక భద్రతా చర్యలను సూచించినట్లు తెలిపింది. శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది, సీసీ కెమెరాలు, అవసరమైన చోట విద్యుత్ దీపాలు, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు (సీపీఏ) అమలు, రోగి బంధువుల సంఖ్యను నియంత్రించడం, సైరన్ వ్యవస్థల ఏర్పాటు, కనీస సౌకర్యాలతో డ్యూటీ రూమ్‌లు ఏర్పాటు వంటివి సూచించినట్లు తాజా అధ్యయనం పేర్కొంది. కేరళ రాష్ట్ర ఐఎంఏ పరిశోధనా విభాగానికి చెందిన డాక్టర్ రాజీవ్ జయదేవన్, ఆయన బృందం ఈ సర్వే ఫలితాలను సంకలనం చేశారు. 'ఆన్ లైన్ సర్వే గూగుల్ ఫారమ్ ద్వారా భారతదేశం అంతటా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు పంపించగా, 24 గంటల్లో 3,885 స్పందనలు వచ్చాయి' అని డాక్టర్ జయదేవన్ చెప్పారు. కొందరు వైద్యులు ఆత్మరక్షణ కోసం ఆయుధాలను తీసుకువెళ్లడం ప్రారంభించాల్సిన అవసరం ఉందని సూచించారు. డ్యూటీ రూమ్ చీకటిగా ఉండటం, నిర్జనమైన కారిడార్ చివర ఉన్నందున ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఎప్పుడూ మడతపెట్టగల కత్తి, పెప్పర్ స్ప్రేని తీసుకువెళుతుందని ఒక వైద్యుడు అంగీకరించాడు. పరిమిత సిబ్బంది, భద్రత లేని కొన్ని చిన్న ఆసుపత్రుల్లో పరిస్థితి దారుణంగా ఉంది. కాగా, హింసను ప్రధానంగా జూనియర్ వైద్యులు అనుభవిస్తారు. వీరు ముందు వరుసలో ఉన్నందున, ముఖ్యంగా హాని కలిగి ఉంటారు. కానీ పరిపాలన లేదా విధాన రూపకల్పనలో పరిమిత ప్రమేయం కలిగి ఉంటారు.

సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సుద్దాలకు సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ: మహాకవి శ్రీశ్రీ రచనలు తనకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. స్థానిక హనుమాన్‌పేటలో సీపీఐ రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ... సుద్దాలను శాలువాతో సత్కరించారు. వీరిద్దరూ వివిధ సామాజిక అంశాలపై చర్చించారు. తన తండ్రి సుద్దాల హనుమంతు స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న నేపథ్యాలను అశోక్‌తేజ గుర్తుచేసుకున్నారు. సినిమా రంగంలో తాను రచించిన అభ్యుదయ గేయాలను ప్రస్తావించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పీ చంద్రనాయక్, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, సీపీఐ నాయకులు తాడి పైడియ్య, లంకా గోవిందరాజు, కే కార్తీక్ పాల్గొన్నారు.

'గుడ్లవల్లేరు ఇంజినీరింగ్' గుర్తింపు రద్దు

నిందితులను కఠినంగా శిక్షించాలి: ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో వెలుగుచూసిన ఘోర సంఘటన... గత రెండు సంవత్సరాలుగా జరుగుతోందని, నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని, ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాన్యులకైతే ఒక న్యాయం ... రాజకీయ నాయకుల పిల్లలకైతే మరొక న్యాయమా అని ప్రశ్నించారు. విద్యార్థినుల వసతి గృహం బాత్‌రూమ్‌లో 29వ తేదీ సాయంత్రం రహస్య కెమేరా పట్టుబడిందని, దీంతో ఒక్కసారిగా వారిలో ఆందోళన నెలకొందన్నారు. విద్యార్థినులు బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే భయంతో వణికిపోతున్నారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థినిలు ఆందోళనకు దిగారని, ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా కళాశాల యాజమాన్యం శాయశక్తుల కృషి చేస్తుందన్నారు. కళాశాలలో ప్రతి విద్యార్థి ఫోన్లలో డేటా చెక్ చేసి వీడియోలు బయటికి వెళ్లకుండా సైబర్ క్రైమ్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు. శనివారం నుంచి ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటామని తెలిపారు.

యాజమాన్యంపై క్రిమినల్ కేసు: మహిళా సమాఖ్య

విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమేరాలు పెట్టిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వసతి గృహం బాత్‌రూమ్‌లో రహస్య కెమేరాలతో అసభ్యకరంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్న యాజమాన్యం పర్యవేక్షణలో వైఫల్యం చెందిందన్నారు. ముందస్తు సమాచారం ఉన్నా స్పందించలేదని మండిపడ్డారు. యాజమాన్యంపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పరిశోధనల బడ్జెట్ పెంచాలి

ఓయూ మార్చ్ ఫర్ సైన్స్‌లో శాస్త్రవేత్తలు, విద్యార్థుల డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోగల ఉస్మానియా యూనివర్సిటీలో మార్చ్ ఫర్ సైన్స్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన ఈ ప్రదర్శనలో నగరంలోని వివిధ ప్రగతిశీల శాస్త్రీయ విజ్ఞాన సంఘాలు పాల్గొన్నాయి. సీసీఎంబీ, ఐసీఏఆర్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలతో పాటు ఆంధ్రా మహిళా కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శాస్త్రీయ పరిశోధనలకు బడ్జెట్ పెంచాలని, జీడీపీలో మూడు శాతం నిధులు కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాల్లో అశాస్త్రీయ ధోరణులు తొలగించాలని, మూఢనమ్మకాల నిషేధానికి చట్టం తేవాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం ఆంధ్ర మహిళా కళాశాలలో అక్కడి ప్రిన్సిపల్ డాక్టర్ ఝాన్సీ అధ్యక్షత జరిగిన సభలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాధ, డాక్టర్ సోమ మర్ల, ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్ రెడ్డి ప్రసంగించారు. 112 దేశాల్లో నిర్వహించే అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, దిల్లీ, చెన్నై, కోల్‌కతా తదితర నగరాల్లో మార్చ్ ఫర్ సైన్స్ నిర్వహించారు.

బీజేపీలోకి చంపై సోరెన్

జార్ఖండ్: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ శుక్రవారం కాషాయ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర రాజధాని రాంచీలో జరిగిన కార్యక్రమంలో తన మద్దతుదారులతో కలిసి ఆయన బీజేపీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ అవమానాలు భరించలేక కమలం పార్టీలోకి వచ్చానన్నారు. తొలుత రాజకీయాలకు స్వస్తి పలకాలని భావించగా, జార్ఖండ్ ప్రజల ప్రేమానురాగాల కారణంగా ఆ ఆలోచన మార్చుకున్నట్లు చెప్పారు. కొత్త పార్టీ పెట్టాలని కూడా యోచించాను కానీ బీజేపీలో చేరి జార్ఖండ్ ప్రజలకు సేవ చేయాలని తర్వాత నిర్ణయించుకున్నానన్నారు. తన మనస్సులో మలినం లేదని, తనపై నిఘా పెడతారని ఊహించలేదని, ఈ పరిణామాలు బాధించాయని చంపై సోరెన్ తెలిపారు. జార్ఖండ్ కోసం పాటుపడిన తనపై నిఘా పెట్టడం, అవమానించడాన్ని భరించలేక

జేఎంఎంకు స్వస్తి పలికి బీజేపీలో చేరానని ఆయన చెప్పారు. జేఎంఎం కోసం పాటుపడ్డాను, రక్తాన్ని ధారపోశాను కానీ చివరకు ఘోరంగా అవమానించారు. అందుకోసమే వేరొక పార్టీలో చేరాలని నిర్ణయించుకొని కాషాయ కండువా కప్పుకున్నా. ఇప్పుడు ప్రపంచంలోనే పెద్ద పార్టీ సభ్యుడిగా గర్విస్తున్నా' అని చంపై సోరెన్ అన్నారు. కాగా, చంపై సోరెన్ రాకతో తమ పార్టీకి మరింత బలం చేకూరిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. కార్యక్రమంలో అసోం సీఎం హిమంతా బిశ్వశర్మ పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి లోకేశ్‌కు ఏఐఎస్ఎఫ్ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: నూజివీడు త్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం లేఖ రాశారు. శ్రీకాకుళం, నూజివీడు త్రిపుల్ ఐటీలలో చదువుతున్న విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం 800 మంది విద్యార్థులు జ్వరం, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మెస్‌ల్లో ఉడికిఉడకని అన్నం, నీళ్ల చారు, పప్పు, మజ్జిగ ఇస్తున్నారని వివరించారు. వంటశాల పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. అపరిశుభ్ర వాతావరణంపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌కు తెలిపినా పట్టించుకోలేదన్నారు. త్రిపుల్‌ఐటీల్లో ఫుడ్ కోర్టులకు డైరెక్టర్ సహకరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కృష్ణమ్మకు వరద ప్రవాహం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు/తాడేపల్లి: కృష్ణమ్మకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయానికి భారీగా వచ్చి నీరు వచ్చి చేరుతుండటంతో 10 స్పిల్‌వే గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ సాగర్‌కు 2,79,370 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి 24,000, ఎగువ జూరాల, సుంకేసుల నుంచి జలాశయానికి 3,04,150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో దిగువ పోతిరెడ్డిపాడుకు 30,000, హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,688, ఏపీ జల విద్యుత్‌కు 30,791 క్యూసెక్కులు, తెలంగాణా జల విద్యుత్‌కు 37,882 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి ఔట్‌ఫ్లో 3,82,131 క్యూసెక్కులుగా ఉంది. జలాశయం పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 884.70 అడుగులు నీరు ఉంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 213.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి: పులిచింతల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీకి మిగులు జలాలు పెద్దఎత్తున తరలివస్తుండటంతో బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. నీటి ప్రవాహం మూడున్నర లక్షల క్యూసెక్కులకు చేరుకుంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 3.09 టీఎంసీలు నిండి, 12 అడుగుల మేర నీటినిల్వ ఉన్న నేపథ్యంలో బ్యారేజీ నిండు కుండను తలపిస్తోంది. దీంతో బ్యారేజీ 70 గేట్లను అడుగు మేర ఎత్తి 3,18,850 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలారు. సాగునీటి అవసరాల కోసం 16,201 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో 3,35,051 ఉండగా, కాలువలకు, సముద్రంలోకి విడుదల చేసిన నీటితో అవుట్ ఫ్లో 3,35,051గా ఉంది. ఇది కాస్త శుక్రవారం అర్ధరాత్రికి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు.

మహిళల భద్రతకు ఎంతో చేయాలి: రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రమంలో దేశంలో మహిళల భద్రత కోసం ఇంకా ఎంతో చేయాల్సి ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం తీవ్ర యోచన చేస్తోందని అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. 'అత్యాచారం వంటి నేరాలకు మరణశిక్ష విధించేలా చట్టాలను సవరించాం. ఆ చట్టాలను కఠినంగా అమలుచేయాలి. దేశంలో మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలు, నేరాలు చూస్తుంటే... ఇంకా చేయాల్సింది ఎంతో ఉందనిపిస్తోంది. మహిళలపై జరుగుతోన్న నేరాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఆ దిశగా కొన్ని రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన అమానవీయమైనది" అని మంత్రి పోస్టు పెట్టారు. అలాగే తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన రాజ్‌నాథ్.. మహిళల భద్రత అంశాన్ని ప్రస్తావించారు. అభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం తమ ప్రభుత్వ హయాంలో భారీగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం గురించి ప్రస్తావించారు. తమ ప్రభుత్వం తీసుకున్న చొరవ వల్ల హరియాణా వంటి రాష్ట్రాల్లో లింగనిష్పత్తిలో మెరుగుదల కనిపించిదని చెప్పారు. "స్వాతంత్ర్యం తర్వాత.. ఈ దేశ అభివృద్ధిలో మహిళలకు తగిన ప్రాధాన్యం లభించలేదు. కానీ ఇప్పుడు ఈ పరిస్థితిలో అనూహ్య మార్పు వస్తోంది. దేశ భద్రతా బలగాల్లో మహిళల పాత్ర పెరుగుతుండటమే అందుకు నిదర్శనం" అని తెలిపారు. కొన్ని రోజుల క్రితం బెంగాల్‌లోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అఘాయిత్యం జరిగింది. ఆ మరుసటి రోజు ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఈ కేసులో పోలీసు వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసును కలకత్తా హైకోర్టు.. సీబీఐకి బదిలీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని విపక్షాలు, పలు సంఘాలు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తంచేస్తున్నాయి. ఈనేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం అత్యాచారాల నిరోధకానికి కొత్త బిల్లు తీసుకురాబోతోంది. కఠిన నిబంధనలతో రూపొందిస్తున్న ఈ బిల్లు ప్రకారం దోషులుగా తేలిన వ్యక్తులకు మరణ దండన విధించే అవకాశం ఉంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి సోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ్ వెల్లడించారు. బిల్లును సభలో సమగ్రంగా చర్చించి ఆమోదించడం కోసం సెప్టెంబరు 2 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు స్పీకర్ బిమన్ బెనర్జీ తెలిపారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలకు ముమ్మర ఏర్పాట్లు

విశాఖలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఇతర నాయకులు శుక్రవారం పర్యవేక్షించారు. సభా వేదికకు సంబంధించి కార్యకర్తలకు సూచనలు చేశారు. 3వ తేదీన జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కొత్త పింఛన్ ఫారం

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వ ఉద్యోగుల కోసం సరళీకరించిన పింఛన్ ఫారాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ శుక్రవారం ఆవిష్కరించారు. దేశంలోని వృద్ధులు, పింఛన్‌దారుల జీవితాన్ని మరింత సులభతరం చేసేదిగా కొత్త దరఖాస్తు పత్రాన్ని తీసుకొచ్చామన్నారు. తొమ్మిది పత్రాల స్థానంలో 'ఫారం 6-ఏ'ను అందుబాటులోకి తెచ్చామని ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. పింఛన్ కోసం ఒకటే దరఖాస్తు సరిపోతుందని, గతంలో కంటే సరళంగా ఉండటంతో పింఛన్‌దారులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ-హెచ్ఆర్ఎంఎస్‌తో మరొక మైలురాయిని పింఛన్& పింఛన్‌దారుల సంక్షేమ శాఖ చేరుకొన్నదన్నారు. ఎలక్ట్రానిక్ మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ (ఈ-హెచ్ఆర్ ఎంఎస్)లో ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రికార్డులు ఉంటాయి. ఇందులో నమోదు చేసుకున్న వారు ఫారం 6-ఏ ద్వారా... నమోదు చేసుకోని వారు భవిష్య డిజిటల్ ఇంటిగ్రేషన్‌లో ఫారం 6-ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పింఛన్ కోసం దరఖాస్తు చేయాలంటే పింఛన్‌దారుని ఈ-సైన్ (ఆధార్ ఆధారిత ఓటీపీ) సరిపోతుందని సింగ్ వెల్లడించారు.

26 జిల్లాల ప్రత్యేక అధికారులు వీరే...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అన్ని జిల్లాలకు ఐఏఎస్ హోదా గల వారిని ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీజేశారు. ప్రభుత్వ కార్యకలాపాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషిస్తారు. 26 జిల్లాల వారీగా నియమించిన ప్రత్యేక అధికారుల వివరాలివి. ఎన్టీఆర్‌జిల్లా- జి.జయలక్ష్మి, ఏలూరు-శశిభూషణ్ కుమార్, అనంతపురం-కాంతిలాల్ దండే, విశాఖపట్నం- సౌరభ్ గౌర్, పార్వతీపురం మన్యం-కోన శశిధర్, పశ్చిమ గోదావరి-బాబు.ఏ, శ్రీసత్యసాయి-ఎన్.యువరాజ్, చిత్తూరు -ఎంఎం నాయక్, కర్నూలు-కె.హర్షవర్ధన్, నంద్యాల- పోలా భాస్కర్, శ్రీకాకుళం-ప్రవీణ్‌కుమార్, బాపట్ల-ఎంవీ శేషగిరిబాబు, అల్లూరిజిల్లా-కన్నబాబు, తిరుపతి-ఎస్.సత్యనారాయణ, విజయనగరం-వి.వినయ్ చంద్, అన్నమయ్య- ఎ.సూర్యకుమారి, పల్నాడు-జి.రేఖా రాణి, కాకినాడ-జి.వీర పాండియన్, నెల్లూరు- సిహెచ్.హరికిరణ్, అనకా పల్లి- చెరుకూరి శ్రీధర్, ప్రకాశం- గంధం చంద్రుడు, కడప- కేవీఎస్ చక్రధర్ బాబు, తూర్పుగోదావరి-ఎం.హరి నారాయణ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ -లత్కర్ శ్రీకేశ్ బాలాజీరావు, కృష్ణా- వి.విజయరామరాజు, గుంటూరు-ఎం.మల్లికార్జున.

ధర్మకర్తలు ఆలయాల ఖ్యాతి పెంచాలి: మంత్రి అనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆలయాల ఖ్యాతిని ఇనుమడింపజేసేలా వంశపారంపర్య ధర్మకర్తల పనితీరు ఉండాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. అమరావతిలోని సచివాలయంలో కొందరు ధర్మకర్తలను మంత్రి కలిశారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాల వైభవ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రి తెలిపారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.